
# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 6-12-2024 ₹ 15/-




## బాబరీ టు అజ్మీర్ వయా సంభల్






సహజీవన భావాల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in



సంపుటి: 46 సంచిక: 48 హైదరాబాద్
శుక్రవారం 6 డిసెంబర్ 2024 రూ.15-00
4 జమాది ఉల్ ఆఖిర్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

"మీలో ఎవరయితే ఉత్తమ గుణగణాలు గలవారో వారే ఇస్లాం అనుసరణలోనూ ఉత్తములు. అయితే వారికి ధర్మావగాహన ఉండాలి."

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


కథ



16

## సమైక్యతా రాగం

## లోపల...


| | | |
|---|---|---|
| జార్ఖండ్ | ...... | 04 |
| బాబరీ టు అజ్మీర్ వయా సంభల్ | ...... | 05 |
| ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమే! | ...... | 09 |
| పాలస్తీనియుడా...! | ...... | 11 |
| మనిషీ నువ్వెక్కడ? | ...... | 12 |
| చరితార్థులు–2 : అంజదీ బేగం | ...... | 15 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఇస్లామీయ ఉద్యమం–ధర్మ సంస్థాపనం | ...... | 20 |
| ...ఆ రాష్ట్రాల్లో ప్రభుత్వ సేవల్లో ముస్లిం ప్రాతినిధ్యం స్వల్పం | ...... | 24 |
| భారత రాజ్యాంగం (కవిత) | ...... | 27 |
| అసూయ... | ...... | 28 |
| విద్య ఒక మహా వృక్షం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| 5 అంశాల ప్రాముఖ్యత | ...... | 34 |


### క్షణ భంగురం ...



మూణ్ణాళ్ళ ముచ్చట
ఈ ప్రాపంచిక జీవితం
ఒత్తిడి తగ్గించుకోండి
ఎందుకింత సతమతం!
చేతనైతె చెయ్యండి
పరులకింత సాయం
లేకపోతె ఊరుకోండి
చెయ్యకండి గాయం!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# జార్ఖండ్

**ముస్లిములపై** ఆదివాసీలను రెచ్చగొట్టి జార్ఖండ్‌లో గెలవాలనుకున్న బీజేపీ వ్యూహం ఫలించలేదు. జార్ఖండ్లో ఆదివాసీ జనాభా ఎక్కువన్నది గమనించాలి. జె.ఎం.ఎం., కాంగ్రెసులు కలసి అక్కడ ఘనవిజయాన్ని నమోదు చేశాయి. సంతాల్ పరగణ వంటి ఆదివాసీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో జెఎంఎం కూటమి సత్తా చాటి చెప్పింది.

జార్ఖండ్‌లో జెఎంఎం, కాంగ్రెసు ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాల్లో చొరబాటుదారులకు అవకాశాలిస్తుందని బీజేపీ ఆరోపించింది. జెఎంఎం, కాంగ్రెసులు ఆదివాసీ ప్రయోజనాలను మంటగలుపుతున్నారనే బీజేపీ వాదనలో మతచిచ్చు రాజకీయాలున్నాయి. ఈ ప్రచారానికి కావలసిన ఫేక్ వార్తలు కూడా చక్కర్లు కొట్టాయి. బీజేపీ వీడియో ప్రచారంలో ముస్లిం టోపీలు పెట్టుకున్న వాళ్ళు, బురఖాలు ధరించిన మహిళలను చూపిస్తూ దాడులు చేసినట్లు ప్రచారం చేశారు. ఈ బరి తెగించిన ప్రచారాన్ని చివరకు ఎన్నికల కమీషన్ ఆపవలసి వచ్చింది.

కాని జార్ఖండ్‌లో ఈ మతచిచ్చు రాజకీయాలు పనిచేయలేదు. బెంగాల్‌కు ఆనుకుని ఉన్న సంతాల్ పరగణలో చొరబాటుదారుల గురించి బీజేపీ ఊదరగొట్టింది. కాని అక్కడ కూడా బీజేపీకి తలబొప్పి కట్టింది.

జెఎంఎం కూటమిలో కాంగ్రెసుతో పాటు రాష్ట్రీయ జనతాదళ్, కమ్యునిస్టు పార్టీలు కూడా ఉన్నాయి. 81 స్థానాల అసెంబ్లీలో ఈ కూటమి 56 స్థానాలు గెలుచుకుంది. సంతాల్ పరగణలో స్వయంగా ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల ప్రచారం చేశారు. బంగ్లాదేశీలు, రోహింగ్యా ముస్లిములు చొరబడుతున్నారని, కుట్రపూరితంగా ఆదివాసీ మహిళలను పెళ్ళాడి, ఆదివాసీ భూములను లాక్కుంటున్నారని ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో వాస్తవాలు శూన్యం అన్నది ప్రజలు గ్రహించడమే కాదు, తమ అసలు సమస్యల పైనే ప్రజలు ఆలోచించారు. చొరబాటుదారులనే కథను నమ్మలేదు. యస్టీ రిజర్వ్‌డ్ స్థానాలన్నీ జెఎంఎం గెలిచింది.

హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించినా బీజేపీకి లాభం కలగలేదు. హేమంత్ సోరెన్ మరిన్ని ఓట్లతో ఘన విజయం సాధించారు. ముండా, హో ఆదివాసీలు ఎక్కువగా ఉన్న కోల్హాన్‌లో బీజేపీ కేవలం ఒక్క సీటు సాధించింది. అది కూడా పార్టీ మార్పిడిని ప్రోత్సహించి సాధించిన సీటు.

జార్ఖండ్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 2019లో సాధారణ ఎన్నికల్లో కనిపించిన ధోరణే ఇక్కడ కూడా కనిపిస్తుంది. హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయడం కూడా బీజేపీకి నష్టం కలిగించింది. పైగా ఇంతకు ముందు బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు ఆదివాసీ భూహక్కులను నీరుగార్చ డానికి చేసిన ప్రయత్నాలను కూడా ప్రజలు మరిచిపోలేదు. బీజేపీ ఆదివాసీ వ్యతిరేక పార్టీగా ప్రజల మద్దతు కోల్పో యింది. దానికి తోడు జెఎంఎం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కూడా ఈ విజయానికి కారణమని చెప్పాలి.

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యానా, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు గమనిస్తే సంక్షేమ పథకాలు ప్రజల ఓట్లను సాధిస్తున్నాయన్నది స్పష్టమవుతుంది. తాయిలాల కల్చర్, రేవడీ కల్చర్ అని ఈసడించిన బీజేపీ లాడ్లీ బెహన్, లడ్కీ బెహన్ వగైరా స్కీములతో చేస్తున్నది కూడా ఈ పనే. రాహుల్ గాంధీ న్యాయ్ పత్ర్ గురించి మాట్లాడినప్పుడు, ఉచితాలతో ఆర్థిక వ్యవస్థను గుల్ల చేస్తారని విమర్శనాస్త్రాలు సంధించిన మేధావులు, పత్రికా రచయితలు బీజేపీ సంక్షేమ పథకాల విషయంలో నోరు విప్పకపోవటం విడ్డూరం.

అబ్దుల్ వాహెద్




# బాబరీ టు అజ్మీర్ వయా సంభల్

అజ్మీర్‌లో ఉన్న దర్గా ఒక శివమందిరం అనే కేసును రాజస్థాన్ న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లో షాహీ జామా మస్జిద్ వివాదం ఒకవైపు కొనసాగుతున్నప్పుడే ఈ వార్త కూడా వచ్చింది. సంభల్ వివాదం హింసాత్మకమయ్యింది. ఐదుగురు అమాయకుల ప్రాణాలు పోయాయి. బాబరీ వివాదంలో ఎన్ని ప్రాణాలు పోయాయో ఇక్కడ ప్రస్తావించడం చర్విత చరణమే.

హిందూసేన నాయకుడు విష్ణు గుప్త న్యాయస్థానంలో అజ్మీర్ దర్గాపై పిటీషన్ వేశాడు. సూఫీ ఖాజా మొయినుద్దీన్ చిష్తీ దర్గా దేశంలో ప్రముఖ దర్గాల్లో ఒకటి. విశేషమేమిటంటే అజ్మీర్ దర్గాకు వెళ్ళేవారిలో ముస్లిమేతరులు కూడా పెద్ద సంఖ్యలో ఉంటారు. ఇప్పుడు అజ్మీర్ దర్గాను శివమందిరంగాను, సంకట్ మోచన్ మహాదేవ్ టెంపుల్ గాను ప్రకటించాలనే రాజకీయాలు మొదలయ్యాయి. దేశంలో బాబరీ రాజకీయాలు కొనసాగించడానికి కావలసినన్ని స్థలాల జాబితా సిద్ధంగా ఉందని తెలుస్తూనే ఉంది. ఇప్పుడు దర్గాలో సర్వే చేయించాలని, హిందువులకు అక్కడ పూజలు చేసుకునే అనుమతి ఇవ్వాలని పిటీషనర్ కోరాడు. మస్జిదులో జై శ్రీరామ్ నినాదాలిస్తే తప్పేంటని స్వయంగా న్యాయమూర్తే వ్యాఖ్యానించిన వాతావరణంలో జీవిస్తున్నాం కాబట్టి ఈ సర్వే ఆదేశాలు త్వరలోనే రావచ్చు.

అజ్మీర్ దర్గా విషయంలో సుప్రీంకోర్టు కల్పించుకోవాలని ఆప్ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ కోరారు. ఎందుకంటే దేశంలో ఆరాధనాలయాల పరిరక్షణ చట్టం ఒకటి ఉంది. ఈ చట్టాన్ని 1991లో చేశారు. ఈ చట్టం ప్రకారం, బాబరీ మస్జిద్ అప్పటికే

వివాదంలో ఉంది కాబట్టి, బాబరీ మస్జిద్ తప్ప దేశంలోని ఇతర ఆరాధనాలయాలన్నీ 1947 ఆగష్టు 15వ తేదీన ఎలా ఉన్నాయో అలాగే ఉంచాలి. వాటిని మార్చడానికి ప్రయత్నించ రాదు. మతసామరస్యాన్నీ కాపాడ్డానికి, మస్జిద్ మందిర్ వివాదా లను అడ్డుకోడానికి చేసిన చట్టం ఇది. ఇప్పుడు ఈ చట్టాన్ని ఎవరూ పట్టించుకుంటున్నట్లు కనిపించడం లేదు. మస్జిద్ మందిర్ వివాదాలు రాజేయడానికి ఒక జాబితా సిద్ధంగా పెట్టుకున్న శక్తులు ఈ పని కొనసాగిస్తూనే ఉన్నాయి. వారణాసిలోని గ్యానవాపి మస్జిదు, మధురలోని షాహీ ఈద్గా, మహారాష్ట్రలోని హాజి మలంగ్ దర్గా, సంభల్‌లోని షాహీ మస్జిదు, కుతుబ్ మినార్, తాజ్ మహల్–ఇలా ఈ జాబితా చాలా పెద్దది.

అజ్మీర్ దర్గా గత 800 సంవత్సరాలుగా ఉంది. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మాత్రమే కాదు, ప్రస్తుత ప్రధాని మోడీ కూడా అజ్మీర్ దర్గాకు చాదర్ పంపించారు. కాని ఇప్పుడు దేశంలో మస్జిదులు, దర్గాల సాకుతో మతతత్వ విద్వేషం సాగు చేసే ప్రయత్నాలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయి. మజ్లిస్ నాయకుడు ఒవైసీ ఈ విషయం గురించి మాట్లాడుతూ కింది కోర్టులు ఆరాధనాలయాల చట్టాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

బాబరీ మస్జిద్ వివాదం కూడా ఇలా కోర్టు కేసులతోనే మొదలై మత ఉద్రిక్తతలకు కారణమయ్యింది. బీజేపీకి ఎన్నికల రాజకీయాల్లో ఉపయోగపడింది. ఈ క్రమంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు.

ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో ఏం జరుగుతుందో కాస్త గమనించండి. సంభల్, బహ్రాయిచ్ రెండూ ఉత్తరప్రదేశ్‌లోనే ఉన్నాయి. అక్టోబర్‌లో బహ్రాయిచ్‌లో మతఘర్షణలు జరిగాయి. ప్రాణాలు పోయాయి. ఇప్పుడు సంభల్‌లో మతఘర్షణలు జరిగాయి. ఇక్కడా ప్రాణాలు పోయాయి. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో మతతత్వ ఉద్రిక్తలు పెంచే ప్రయత్నాలు పథకం ప్రకారం జరుగుతున్నాయా అన్న అనుమానాలు సహజంగానే పెరుగుతున్నాయి. ముజఫ్ఫర్ నగర్, బరేలీ, అలీగఢ్ ... ఉత్తరప్రదేశ్ మతఘర్షణల చరిత్ర మన ముందుంది.

ఈ మతతత్వ రాజకీయాలను గమనిస్తే స్పష్టంగా అర్థమయ్యేది ఒక్కటే. ఒక సముదాయాన్ని విలన్లుగా మార్చి చూపించడం ద్వారా ఎన్నికల ప్రయోజనాలు పొందడం ఒక ఫార్ములాగా మారింది.

ఇప్పుడు పత్రికలు, మీడియా మాట్లాడుతున్న భాష కూడా మతతత్వ రాజకీయాలకు ఉపయోగపడే భాషగానే వినిపిస్తుంది. ఒక వర్గాన్ని విలన్లుగా చూపించడంలో మీడియా కూడా తన వంతు పాత్ర పోషిస్తోంది. ధర్మాన్ని కాపాడాలంటూ మీడియా కూడా ఈ రాజకీయ క్రీడలో సమానస్థాయిలో కనిపిస్తోంది. ఇప్పుడు మీడియా అంటే గోదీ మీడియా అనే మాట వినిపిస్తున్న నేపథ్యంలో మీడియా నుంచి అంతకన్నా ఎక్కువ ఆశించలేం.

సంభల్‌లో ఏం జరిగింది? అక్కడి జామా మస్జిదు అసలు మస్జిదు కాదు మందిరం అంటూ పిటీషన్ వేశారు. క్షణం ఆలస్యం చేయకుండా కోర్టు సర్వేకు ఆర్డర్ వేసింది. అంతే వేగంగా అధికారులు సర్వే కూడా చేయించారు. ఇంత వేగంగా న్యాయస్థానాల్లో కేసులు నడవడం ఆశ్చర్యం కలిగించడం లేదా? ఏది ఏమైనా మొదటిసారి సర్వే శాంతియుతంగా జరిగిన తర్వాత కూడా రెండవసారి సర్వే ఎందుకు చేయించాలను కున్నారు. రెండవసారి సర్వే జరుగుతున్నప్పుడు హింసాత్మక పరిస్థితి ఎందుకు ఏర్పడింది. అసలు రెండవసారి సర్వే అవసర మేమొచ్చింది? సుప్రీంకోర్టు ఈ విషయాలను పరిశీలించడం అవసరమా కాదా? ఏ రోజు పిటీషన్ వేశారో అదే రోజు ఆదేశాలు ఎలా వచ్చేశాయి? దీనిపై అనేకమంది ప్రశ్నలు సంధిస్తున్నారు.

గ్యానవాపి వివాదాన్ని రాజేసిన వకీలు హరిశంకర్ జైన్ ఈ వివాదంలోను పిటీషనర్. కొందరు ఒక పథకం ప్రకారం ఈ వివాదాలు సృష్టిస్తున్నారని అర్థం కావడం లేదా? 1526లో మందిరాన్ని కూల్చి మస్జిదు నిర్మించారని అంటున్నారు. బాబరీ మస్జిద్ వివాదంలో మందిరాన్ని కూల్చి మస్జిద్ కట్టారన్నది నిరూపించారా? రుజువులు చూపించారా?

సంభల్ మస్జిదుపై పిటీషన్ వేసిన కొన్ని గంటల్లోనే సర్వే ఆదేశాలు అక్కడి సివిల్ జడ్జి ఆదిత్యసింగ్ జారీ చేశారు. న్యాయం ఎంత వేగంగా పని చేస్తుందో అని ఆశ్చర్యపోవడం మన వంతయ్యింది.

ఆప్ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ ఈ విషయమై మాట్లా డుతూ, మధురలో సర్వే చేయించారు, ప్రశాంతంగా జరిగింది. కాశీలో సర్వే చేయించారు, ప్రశాంతంగా జరిగింది. మరి ఇక్కడ హింసాకాండ ఎలా జరిగింది? ఇది ఇక్కడి ప్రభుత్వం చేయించిన ఘనకార్యమనీ, కుట్రపూరితంగా చేయించిన హింసాకాండ అని

ఆరోపించారు. పిటీషన్ వేసిన వెంటనే, మరో పక్షం వాదన వినకుండా ఆదేశాలు న్యాయస్థానం ఇచ్చేయడం, మరుక్షణం సర్వే ప్రారంభం కావడం ... ఇలా సాధారణ ప్రజల విషయంలో న్యాయస్థానాలు వేగంగా పని చేయడం చూశామా అని ప్రశ్నించారు.

మొదటి సర్వే ప్రశాంతంగా జరిగింది. కాని ప్రశాంతంగా సర్వే జరగడం కాదు కదా మతశక్తులు కోరుకుంటుంది. రెండవసారి సర్వే చేయించారు. సర్వే టీముతో పాటు మతపరమైన నినాదాలిస్తూ కొందరు నడుస్తున్న వీడియో వచ్చింది. సర్వే టీముతో పాటు మతపరమైన నినాదాలిస్తున్న వాళ్ళు సర్వే టీము సభ్యులా? ఎవరు వాళ్ళు? వాళ్ళను ఎవ్వరూ అడ్డుకోలేదు. వాళ్ళు కూడా సర్వే టీము సభ్యులేనా? అంటే సర్వే టీము ఒక మతానికి సంబం ధించిన వారిదా? హింసాకాండను ఎలా రెచ్చగొట్టారో ఇదంతా గమనిస్తే స్పష్టంగా అర్థమవుతుంది.

కాంగ్రెసు నేత సుప్రీయి శ్రినేత్ ఈ విషయం గురించి మాట్లాడుతూ మణిపూర్‌లో మంటలు పెట్టిన బీజేపీ ఇప్పుడు దేశమంతా మంటపెట్టాలని చూస్తోందన్నారు. ముస్లిములపై బీజేపీ ద్వేషం వల్లనే ఈ హింసాకాండ అని చెప్పారు. సర్వే టీముతో పాటు మతపరమైన నినాదాలిచ్చిన వారి గురించి, పోలీసుల వైఖరి గురించి ఆమె ప్రస్తావించారు- వివాదాలు సృష్టించే ఒక ఫార్ములా కనిపెట్టారని. క్రింది కోర్టులో పిటీషన్ వేస్తారు... సర్వే ఆర్డర్ వస్తుంది... మస్జిదుల్లో నినాదాలతో వెళతారు... ఘర్షణ జరుగుతుంది... బీజేపీ నేతలకు మత రాజకీయాల అవకాశం దొరుకుతుందని చెప్పారు.

ఇదంతా గమనిస్తే పాలనాయంత్రాంగం, పోలీసు యంత్రాంగం కూడా మతతత్వ శక్తులకు తోడయ్యిందని కొందరు విశ్లేషిస్తున్నారు. రాహుల్ గాంధీ చేసిన ట్వీటు గమనించదగింది. సంభల్ వివాదంలో రాష్ట్ర ప్రభుత్వం పక్షపాతంతో వ్యవహ రించిందని స్పష్టంగా ఆయన చెప్పారు. హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెట్టే చర్యలు రాష్ట్రానికి, దేశానికి మంచిది కాదని ఆయన చెప్పారు. అఖిలేష్ యాదవ్ కూడా తన ట్వీటులో సర్వే పేరుతో ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నాలను సుప్రీంకోర్టు వెంటనే గమనించాలని కోరారు. ఈ మతఘర్షణలు ప్రభుత్వం చేయించిన మతఘర్షణలని నిర్మొహమాటంగా చెప్పారు.

సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకుంటుందా? దేశంలో బుల్డోజర్ ప్రయోగాలు జరుగుతున్నా సుప్రీంకోర్టు చాలా కాలం తర్వాత కాని దీనిపై స్పందించలేదు. సర్వే పేరుతో జరుగుతున్న ఈ మతరాజకీయాలను వెంటనే సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవడం అవసరమా కాదా? విచిత్రమేమిటంటే, సుప్రీంకోర్టు ఆదేశాల వల్లనే క్రింది కోర్టులు ఈ సర్వే ఆదేశాలిస్తున్నాయని కొందరు వివరిస్తున్నారు.

మస్జిదు క్రింద ఏముంది? ఏ మందిరం దాగి ఉంది? ముస్లిముల జనాభా పెరిగిపోతోంది. గజ్వాయే హింద్ పథకాలేస్తున్నారు... ఇలాంటి ప్రచారాలతో ముస్లిములను విలన్లుగా చూపించే ఈ రాజకీయాలు ఇంకెంత కాలం నడుపుతారు? దీనివల్ల ఎవరికి ప్రయోజనం. ప్రతి మస్జిదులో శివలింగాన్ని చూడరాదని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ చెప్పిన మాటలు ఇప్పుడెవరికైనా గుర్తున్నాయా? ఆయన ఆ మాటలు సీరియస్‌గా చెప్పారా? లేక ఒకప్పుడు అమిత్ షా చెప్పినట్లు ఈ మాటలు కేవలం జుమ్లాలు మాత్రమేనా? ఆయన సీరియస్ గా చెప్పినా దేశంలో మతతత్వ శక్తులు ఆయన్ను సీరియస్ గా తీసుకోవడం మానేశారా?

సంభల్ హింసాకాండ తర్వాత మోహన్ భాగవత్ ఎలాంటి ప్రకటన చేయలేదన్నది కూడా గమనించాలి.

కుతుబ్ మినార్, తాజ్ మహల్ వగైరాలపై కూడా ఇలాంటి వివాదాలు రాజేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. తాజ్ మహల్ వ్యవహారాన్ని పెద్ద వివాదంగా మార్చే ప్రయత్నం చాలా జరుగుతోంది. ఈ కట్టడాలన్నింటినీ మందిరాలుగా మార్చేస్తే దేశంలో సమస్యలన్నీ పరిష్కారమైపోతాయని జనం నమ్ముతున్నారా? నిజానికి ఆరాధనాలయాల చట్టం ప్రకారం ఈ వివాదాలు తలెత్తనే కూడదు. కాని ఈ వివాదాల వార్తలతోనే మీడియా మారుమోగిపోతోంది. ఈ వివాదాలు నడుస్తున్న జిల్లాలోని కాలేజీల్లో, స్కూళ్ళలో టీచర్లు పూర్తి సంఖ్యలో ఉన్నారా? ఆసుపత్రుల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వాసుపత్రుల్లో ఎంతమంది డాక్టర్లున్నారు? ఇలాంటి సర్వేలు ఎందుకు చేయించరు? చేయించాలని ఎవరూ అడగరే!? కాని మస్జిదు క్రింద మందిరం ఉందో లేదో సర్వే చేయించాలనగానే తక్షణం అందరూ నడుం కట్టి ముందుకొచ్చేస్తారు. ఒకవైపు అదానీ కేసు వార్తలు వస్తున్నాయి. కాని ఈ వివాదాలు, మతఘర్షణల వార్తల్లో అవి కొట్టుకు పోతున్నాయి.

సుప్రీంకోర్టు చూస్తుండగానే బుల్డోజర్ రాజకీయాలు నడిచాయి. బుల్డోజర్ నినాదాలు మిన్నంటాయి. సుప్రీంకోర్టు చాలా కాలం

చూస్తూ గడిపింది. ఇది మితిమీరిపోయిన తర్వాత కాని సుప్రీంకోర్టు దీనిపై అంకుశం పెట్టలేదు. ఇప్పుడు ఈ సర్వేలపై సుప్రీంకోర్టు ప్రతిస్పందిస్తుందా? నిజానికి డి.వై.చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల వల్లనే క్రింది కోర్టులు ఇప్పుడు ఈ సర్వే ఆదేశాలిస్తున్నాయని చాలామంది అంటున్నారు. గ్యానవాపి మస్జిదులో శివలింగం ఉందనే కేసు సందర్భంగా వారణాసి క్రింది కోర్టు సర్వే చేయించాలని ఆదేశించింది. మస్జిద్ కమిటీ దీన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టుకు వెళ్ళింది. ఈ కేసులో ఆయన నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలే సర్వేలకు కారణ మయ్యాయి. దేశంలో ఆరాధనాలయాల చట్టం ఎందుకుంది? మస్జిద్ మందిర్ వివాదాలు తలెత్తకుండా చూడ్డానికి ఉద్దేశించిన ఈ చట్టం పరిస్థితి ఏమిటి? ఇప్పుడు రోజుకో వివాదం పుట్టుకు వస్తోంది. ఈ సర్వేల వల్ల మత రాజకీయాలకు కావలసినంత సరంజామా లభిస్తోంది. మీడియాలో వచ్చే రకరకాల వార్తలు, మీడియా చర్చలు దేశంలో మత ఉద్రిక్తతల వాతావరణానికి కారణమవుతాయి.

క్రింది కోర్టు ఒక మస్జిద్ క్రింద మందిరం ఉండేదా అన్న వివాదం విషయంలో సర్వే ఆదేశాలివ్వగానే ఆ ప్రాంతంలో మతసామరస్య వాతావరణం వెంటనే దెబ్బతింటుంది. మస్జిదు క్రింద మందిరం ఉండేదంట అనే చర్చలు కార్చిచ్చులా వ్యాపిస్తాయి. వివాదం ముదిరి ఘర్షణల స్థాయికి చేరుకుంటుంది. దీనివల్ల సగటు ప్రజలకు ఏమైనా లాభం కలిగిందా?


దేశంలో రాజకీయాలను గమనిస్తే ఎవరికి లాభం కలిగిందో తెలుస్తూనే ఉంది. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. హర్యానా, మధ్యప్రదేశ్ మాదిరిగానే మహారాష్ట్ర కూడా బీజేపీ గెలుచుకుంది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలుస్తుం దనుకున్నారు. కాని బీజేపీ తీసుకువచ్చిన లాడ్లీ బహెన్ యోజనతో మహిళల ఖాతాలో డబ్బులేశారు. అదే వ్యూహం ఇక్కడ మహారాష్ట్రలో అమలు చేశారు. లాడ్లీ బహెన్ యోజన క్రింద మహారాష్ట్రలో మహిళల ఖాతాలో డబ్బులేశారు. పోలింగ్‌కు ముందు ప్రతి ఒక్కరి ఖాతాలో ఏడున్నర వేల రూపాయలు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. మహారాష్ట్రలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న మహిళల కన్నా రెండున్నర రెట్లు ఎక్కువ మంది మహిళల ఖాతాల్లో డబ్బులేశారు.

గమనించవలసిన విషయమేమిటంటే దేశంలో కేవలం 50 శాతం మంది మాత్రమే మూడుపూటల భోజనం చేయ గలిగిన స్థితిలో ఉన్నారు. పోషకాహారం లభించని వారు చాలా మంది ఉన్నారు. మహారాష్ట్రలో 21 శాతం మంది మరాఠాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. మహారాష్ట్రలో ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 1267 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రజల్లో ఇంత పేదరికం ఉన్నప్పుడు ప్రజల ఖాతాలో డబ్బులేస్తే ఎంత సంతోషిస్తారో వేరే చెప్పనవసరం లేదు. గమనించవలసిన విషయమేమిటంటే, రాహుల్ గాంధీ 2019 ఎన్నికల్లో న్యాయ్ స్కీము గురించి ప్రస్తావించినప్పుడు తాయిలాలు పంచిపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసే స్కీముగా విమర్శించిన సోకాల్డ్ మీడియా... మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఈ మనీ ట్రాన్స్‌ఫర్ స్కీమును మాస్టర్ స్ట్రోక్ అంటూ ప్రశంసిస్తోంది. హర్యానా ఎన్నికల్లో, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో, మహారాష్ట్ర ఎన్నికల్లో ఈ తాయిలాల వాగ్దానాలే గెలిపించాయి.

ఇప్పుడు జరుగుతున్నది ఇదే. ప్రజలను పేదలుగా నిరుపేదలుగా మార్చడం. నిరుద్యోగాన్ని పెంచడం. మతరాజకీయాలు చేసి మతఘర్షణల వాతావరణం సృష్టించి మస్జిద్ మందిర్ వివాదాల్లో ప్రజలు, దేశంలోని యువత తలమునకలై పోయేలా చేయడం. దారిద్ర్యం, నిరుద్యోగంలో కూరుకుపోయిన వారికి ఎన్నికలకు ముందు ఖాతాల్లో డబ్బులేసి సంతోషపెట్టడం. ఎన్నికల్లో గెలవడం. ఎన్నికల్లో గెలవడానికి మతరాజకీయాలను కొన సాగించడం. వివాదాలు రాజేయడం, ప్రజలను వివాదాల్లో ముంచి పేదరికాన్ని పెంచడం. తాయిలాలు పంచిపెట్టి సంతోష పెట్టి ఎన్నికలు గెలవడం.

బాబరీ నుంచి అజ్మీర్ దర్గా వరకు వివాదాల్లో ఎవరికి ప్రయో జనం కలిగిందో ఇంకా వివరించవలసిన అవసరం లేదేమో! ❑

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**యండి. ఫారూఖ్ జునైద్ ఖాన్, రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్**

**ఎయిడ్స్ దినోత్సవం** అనేది గత 35 సంవత్సరాలుగా (1988 నుండి) ప్రతి సంవత్సరం డిసెంబరు 1వ తేదీన నిర్వహించబడే ప్రపంచవ్యాప్త ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం. ఈ రోజున, ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు వ్యాధి పట్ల అవగాహనను పెంపొందించే విధంగా ర్యాలీలు, అవగాహన కార్యకలాపాలను నిర్వహిస్తాయి, HIV (హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్) తో జీవిస్తున్న వ్యక్తులకు సంఘీభావం తెలపడంతో పాటు, AIDS సంబంధిత వ్యాధితో మరణించిన వారిని గుర్తుచేసుకుంటారు. ఈ కార్యకలాపాల వల్ల మహమ్మారి గురించిన అవగాహన పెంచడం, నివారణ, చికిత్స, సంరక్షణలో పురోగతిని ప్రోత్స హించడమన్నది ప్రధాన ఉద్దేశ్యం. శాస్త్ర సాంకేతిక పరంగా ఇంత అభివృద్ధి సాధించినా ఎయిడ్స్ ఇంకా చికిత్సలేని వ్యాధిగానే ఉన్నందున ఇలాంటి కార్యక్రమాలు, అవగాహనా దినోత్సవాలు అవసరమవుతున్నాయి. సమాజాన్ని భయపెడుతున్న వ్యాధుల్లో ఇప్పటికీ ఎయిడ్స్ అగ్రభాగంలోనే ఉంది. కాస్త తగ్గుముఖం పట్టిందని భావిస్తున్నప్పటికీ ఇంకా కలవర పెడుతూనే ఉంది. నియంత్రణా మార్గాలేతప్ప, దీని నివారణకు ప్రస్తుతానికైతే మందు లేదు. ఈ మహమ్మారి గురించి పట్టణాల్లోనే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో సైతం కాస్తోకూస్తో అవగాహన పెరిగిన మాట నిజమే అయినా, మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇప్పటికీ కొత్త కేసులు నమోదవుతునే ఉన్నాయి. మరణాలూ సంభవిస్తున్నాయి. దక్షిణాఫ్రికా, నైజీరియాల తరువాత అత్యధిక ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులున్నదేశం మనదే కావడం ఓ భయానక వాస్తవం. 2019 లో భారత దేశంలో 58.96 వేల ఎయిడ్స్ సంబంధిత మరణాలు సంభవిం చాయి. 69.22 వేల కొత్త కేసులు నమోదయ్యాయి. 2021లో ప్రపంచ వ్యాప్తంగా 14.6 లక్షల మందికి HIV సోకింది. ఇందులో 13 లక్షలమంది పెద్దవాళ్ళు కాగా, 15 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగిన పిల్లలు 1.6 లక్షలమంది. 2021 లోనే 6.5 లక్షలమంది HIVతో మరణించారు. ప్రపంచ వ్యాప్తంగా 4 కోట్ల మంది ఎయ్యిడ్స్ వ్యాధిగ్రస్తులున్నట్లు అంచనా. దక్షిణాఫ్రికాలో 56 లక్షల మంది, నైజీరియాలో 33 లక్షల మంది, భారత దేశంలో 24 లక్షల మంది ఉన్నారు. దక్షిణాఫ్రికాలో 3 లక్షల పది వేల మంది, నైజీరియాలో 2 లక్షల ఇరవై వేల మంది ఇప్పటివరకు ఎయిడ్స్ మహమ్మారికి

బలైపోతే, భారతదేశంలో లక్షా డెబ్బయి వేలమంది మృత్యువాత పడ్డారు. హెచ్.ఐ.వి సోకిన వారిలో 25 నుండి 34 సంవత్సరాల లోపు వయసు కలవాళ్ళు 8.1 శాతం బలై పోతుంటే, ఇందులో 40 శాతం మంది హెచ్.ఐ.వి ఎయిడ్స్‌గా మారకముందే మరణిస్తున్నారు. ప్రగతి పథంలో శరవేగంతో దూసుకుపోతున్న ప్రపంచ దేశాలకు ఈనాడు 'ఎయిడ్స్' భూతం సవాలుగా మారడమే కాకుండా సామాజిక, నైతిక, ఆరోగ్యపరమైన సమస్యగా పరిణమించింది. ప్రతిరోజూ ఎనిమిదివేల ఐదు వందలమంది ఈ ఎయిడ్స్ మహమ్మారికి బలైపోతున్నారు. వ్యాధిగ్రస్తుల్లో స్త్రీలు సింహభాగాన్ని ఆక్రమించుకుంటున్నారు. ఈ విధంగా వీరి ద్వారా ఈ మహమ్మారి వారి సంతానానికి సంక్రమిస్తోంది. మరొక విచారకరమైన విషయం ఏమిటంటే, భారత దేశంలోని మొత్తం ఎయిడ్స్ రోగుల్లో 35 శాతం, 15 నుండి 29 సంవత్స రాల లోపు వయసువారే ఉండగా, హెచ్ ఐ వి సోకిన ముక్కు పచ్చలారని చిన్నారులు 34 లక్షలు. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, 1915-1941 మధ్యకాలంలో ఆఫ్రికా ఖండంలో మొట్ట మొదటి హెచ్ఐవి రోగిని గుర్తించినట్లు భావిస్తున్నారు. అప్పట్లో అక్కడ గ్రీన్ చింపాంజీలకు ఎస్ఐవి (SIV) సోకుతూ ఉండేది, అదే హెచ్ఐవిగా రూపాంతరం చెంది మనుషులకు సోకటం ప్రారంభించిందని చెబుతారు. కానీ అధికారిక లెక్కల ప్రకారం ఎయిడ్స్‌కు సంబంధించిన తొలి కేసు 1981 జూన్ 18న అమెరికాలో నమోదైంది. మన దేశంలో మొట్టమొదటి ఎయిడ్స్ రోగిని 1986లో చెన్నయ్‌లో కనుగొన్నారు. తరువాత క్రమక్రమంగా హెచ్ఐవీ ఇన్ ఫెక్షన్ రోగుల సంఖ్య విస్తరిస్తూ పోయింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థ(న్యాకో) అధ్యయనం ప్రకారం భారత దేశంలోని సుమారు 150 జిల్లాల్లో ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా ఈ వ్యాధిగ్రస్తులున్నట్లు తేలింది. దేశంలో లక్షకు పైగా హెచ్ఐవీ కేసులున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ రాష్ట్రం కూడా ఉంది. మన రాష్ట్రంలో 1.59 లక్షల మంది ఎయిడ్స్ రోగులు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు సంకలక్ బుక్‌లెట్-2023 పేరుతో ఐదో ఎడిషన్ నివేదికను ఇటీవల జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థ (న్యాకో), కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా విడుదల చేశాయి. దేశంలో అత్యధిక ఎయిడ్స్ కేసులున్న రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచింది. అక్కడ 3.88 లక్షల మంది హెచ్ఐవీ రోగులున్నారు. ఇక 3.22 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో కర్ణాటక (2.74 లక్షలు), తమిళనాడు(1.65 లక్షలు), తెలంగాణ (1.59 లక్షల మంది), గుజరాత్ (లక్ష) ఉన్నట్లు వార్షిక నివేదిక వెల్లడించింది. దేశంలోని హెచ్ఐవీ కేసుల్లో 72 శాతం ఈ ఆరు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 24.67 లక్షల మంది హెచ్ఐవీ రోగులున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యధిక ఎయిడ్స్ కేసులున్న రెండో దేశంగా భారతదేశం నిలిచిందని నివేదిక తెలిపింది. ఎయిడ్స్ వ్యాధిని రహస్యంగా ఉంచడంవల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. వ్యాధిని బహిర్గతం చెయ్యడం గాని, దాన్ని గురించి ఇతరులకు తెలియడంగాని ఎంతమాత్రం అవమానకర విషయం కాదు. కాని చాలామంది హెచ్.ఐ.వి బాధితులు అవమాన భారంతో, ఇతరులకు చెప్పుకోలేక లోలోపలే కుమిలి పోతుంటారు. కొంతమంది ఇన్ ఫెక్షన్ సోకినట్లు తెలియగానే ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. లేక వ్యాధి బహిర్గతమయ్యే సూచనలు కనిపించినా ఆత్మ త్యాగానికి ఒడిగడుతూ ఉంటారు. సమాజంలో అవగాహనాలేమి దీనికి ప్రధానకారణం. హెచ్. ఐ. వి వ్యాధిగ్రస్తుల్ని కూడా, ఇతర రోగుల్ని చూసినట్లుగానే చూసే సంస్కారం వెల్లివిరిసినప్పుడు వారూ సంతోషంగా, ఎలాంటి సంకోచం లేకుండా జీవించగలుగుతారు. ఎయిడ్స్ ఒకప్పుడు వదలని భూతమే కావచ్చు, కాని ఇప్పుడు బీపీ, షుగర్ లాంటి సాధారణ వ్యాధిగా మారిపోయింది. వ్యాధిని నియంత్రించగలిగే మందులు అందుబాటులోకి రావడమే దీనికి కారణం. కనుక ఆ దిశగా సమాజాన్ని చైతన్య పరుస్తూ, బాధితులకు ధైర్యం నూరి పోయాల్సిన అవసరం ఉంది. ఎయిడ్స్ వ్యాధికి మూలకారణమైన హెచ్.ఐ.వి వైరస్ ప్రధానంగా నాలుగు రూపాల్లో ప్రబలుతుంది.

ఒకటి: అరక్షిత శృంగారం ద్వారా.

రెండు: కలుషిత రక్తం ద్వారా.

మూడు: హెచ్.ఐ.వి సోకిన తల్లి ద్వారా బిడ్డకు.

నాలుగు: కలుషిత నీడిల్స్, సిరంజీల ద్వారా.

అక్రమ సంబంధాలు కొనసాగించడం, ఇంజెక్షన్లు చేయించుకునేటప్పుడు నీడిల్స్ , సిరంజీలు ఒకరికి వాడినవి మరొకరికి వాడడం, స్వలింగ సంపర్కం తదితర కారణాల వల్ల ఈవ్యాధి ప్రబలే ప్రమాదం కనిపిస్తోంది. ఈమహమ్మారి నివారణకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కోట్లాది

రూపాయలు కేవలం ప్రచారం కోసమే ఖర్చుపెడుతున్నాయి. ఈ భూతాన్ని వదిలించడం కోసం చేపడుతున్న కార్యక్రమాలు పూర్తిస్థాయిలో కాకపోయినా ఎంతోకొంత సఫలమౌతున్నాయి. కేవలం ప్రచారార్భాటం కాకుండా ప్రణాళికాబద్ధ కార్యాచరణతో చిత్తశుద్ధిని ప్రదర్శిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. నిర్దిష్ట అధ్యయనం ద్వారా వ్యాధి గ్రస్తుల్ని గుర్తించి, వారిక్కావలసిన మందుల్ని ఉచితంగా అందే ఏర్పాటుచేయాలి. ఈవిధానం ప్రస్తుతం అమల్లో ఉన్నప్పటికీ అందులోని లోపాలను సవరించాలి. వ్యాధిగ్రస్తులు మందులు పొందేవిధానాన్ని బాగా సులభతరం చెయ్యాలి. వారుకోరుకుంటున్న గుప్తతను వైద్యసిబ్బంది గుర్తించి సహృదయంతో స్వాగతించాలి. వారితో సత్సంబంధాలు నెలకొల్పుకోవాలి. వ్యక్తిగత పరిచయాలు, స్నేహాల ద్వారా వారిలో స్థైర్యాన్ని నూరిపోయాలి. అనుభవజ్ఞులైన వైద్యుల వద్ద వైద్య సేవలు పొందుతూ క్రమబద్ధమైన జీవితం గడిపేలా వారిని ప్రోత్సహించాలి. వారిలో నమ్మకాన్ని పాదుకొల్పాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే, సమాజం నైతికంగా పరివర్తన చెందేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టడం మరోఎత్తు. సమాజంలో చెడులు ప్రబలడానికి మూలకారణమైన మద్యం, మనోమస్తిష్కాలను కలుషితం చేస్తున్న అశ్లీల సాహిత్యం – అది ఏరూపంలో ఉన్నా సరే – రూపు మాపవలసిన అవసరాన్ని ప్రజలు, ప్రభుత్వాలు గుర్తించాలి. ఇది ఏమంత చిన్న విషయం కాదు. దీనికోసం ప్రభుత్వాలకు వజ్ర సంకల్పం ఉంటే తప్ప సాధ్యంకాదు. ఈమహమ్మారి తీవ్రత, అదివ్యాపిస్తున్న మార్గాలు, దాని కారణాలను నిశితంగా పరిశీలిస్తూ భావితరాల ఆరోగ్యం కోసం, మరింత మెరుగైన భవిష్యత్తుకోసం చిత్తశుద్ధితో కూడిన కార్యాచరణ అమలు చేయాలి. ఏది ఏమైనా ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా అవగాహనతో, చైతన్యంతో, బాధ్యతతో, నైతిక పరివర్తనే లక్ష్యంగా ముందుకు సాగితే ఈ భూతాన్ని నిలువరించడం, నిర్మూలించడం అసాధ్యమేమీ కాదు. ❑

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

కరీముల్లా కవిత్వం

# పాలస్తీనియుడా..!

ఇప్పుడు నువ్వో
వెచ్చగా పారుతున్న నెత్తుటి నదివే.
హింసల కొలిమిలో
సమ్మెటల్ని భరిస్తున్న లోహ కథవే.
సమయం వస్తుంది
నువ్వు ప్రసవించే కాలం ఒకటుంటుంది.

★★★

ప్రియుడా..! పాలస్తీనియుడా...!
నువ్వో కరిగిపోయిన సంధ్యవని
వెక్కిరిస్తాడు కానీ
వాడికీ తెల్సు...
నువ్వే రేపటి ఉషోదయానివని.
వాడి అబద్ధాల బోనులో
నువ్వో బహిష్కృతుడివని
నిషేధిస్తాడు గానీ
వాడికీ తెల్సు....
నువ్వే రేపటి కాలగ్రంథాల్లో
పిల్లలు మురిపెంగా దాచుకునే
నయనానంద నెమలీకవని.

★★★

యోధుడా..! అమరుడా..!
మృత్యు పరిహాసంతో
సహవాసం చేసే సావాసగాడా !
భూమి పొరల్లోని నీ కలుగు
మట్టి పరిమళమై విస్తరిస్తున్న వెలుగు
అల్ అక్సా సాక్షిగా...
ఉప్పెనౌతున్న నీ రక్తం
నయా ఫిరౌన్ సైన్యాలను ముంచెత్తే నైలు
అరేబియన్ రాజరిక
మునాఫిక్ ముఖౌటాలను చీల్చే కర్బలా ప్రొఫైలు.

★★★

నిన్నో నిత్య జనాజాగా మలిచి
ఖాళీతనాన్ని ఖరారు చేసే
జియోనిస్టు కుతంత్రాల్ని చీల్చి
నీతుల మాటున గోతులు తీస్తూ
నిన్నో పురావస్తు అవశేషంగా మార్చే
భయోనిస్టు పన్నాగాల్ని పేల్చి
శిథిలాల్లోంచి...
శిశిరాల్లోంచి...
మొలిచిన నెలవంకవు నువ్వే...

# మనిషీ నువ్వెక్కడ?



**అర్షియా**

**పక్షుల పరిరక్షణ కోసం పక్షి ప్రేమికులు పాటు పడుతున్నారు!**

**వన్య ప్రాణుల్ని కాపాడుకునేందుకు జంతు ప్రేమికులు శ్రమిస్తున్నారు..!**

**పాముల రక్షణ కోసం స్నేక్ సొసైటీలు పని చేస్తున్నాయి..!**

**చివరికి పిచ్చుకలను సైతం కాపాడుకునేందుకు అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము..!**

**కానీ రోజూ ఎంతో మంది అమాయకుల హత్యల వార్తలు వింటుంటే మానవ ప్రాణానికి విలువ ఉందా అనిపిస్తోంది.**

పసి పిల్లలు అనాథలైపోతున్నారు. అమాయక పౌరులు మృత్యు వాత పడుతున్నారు. ప్రజలు నిత్యం భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఎప్పుడు ఏ ఆపద విరుచుకు పడుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చాలా దేశాల్లో అభాగ్య జనానికి ముప్పూటలా తిండి గింజలు కూడా దొరకడంలేదు. ఆకలి చావులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆడపడుచుల మాన మర్యాదలకు రక్షణ లేకుండాపోయింది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై దారుణాలు కలవరపెడు తున్నాయి. అన్నెంపున్నెం ఎరుగని పసి బాలల పరిస్థితి మరింత దుర్భరంగా తయార య్యింది. అనాథ బాలల స్థితి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అగ్రదేశాలు శత్రు దేశంపై ఆధిపత్యం కోసం జరిపే బాంబుల వర్షాలు దేశాలకు దేశాలనే శ్మశానంగా మార్చేస్తున్నాయి. సొంత దేశంలో పరాయి వారిగా బతకలేక విదేశాల్లో శరణార్థులుగా తలదాచుకోలేక రోహింగ్యా ముస్లిముల దీనగాథను మనం చూశాం.

పలస్తీనా, మయన్మార్, సిరియా తదితర దేశాల్లో రోజూ ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. పసి వయస్సులోనే నూరేళ్లు నిండుతున్న పలస్తీనా బాలల గురించి అడిగేవారెవరూ లేరు.

## హక్కుల పరిరక్షణ

మానవత్వానికి పెద్దపీట వేసే ఇస్లామ్ ధర్మ సంస్థాపనలోనే మానవ హక్కులకు రక్షణ లభిస్తుంది. ముస్లిమ్ దేశాలు ఈ పనికి

పూనుకోనంత కాలం మానవ హక్కుల రక్షణ ఎండమావిగానే మిగిలిపోతుంది.

'మనుషులకు న్యాయం, సమానత్వం దక్కాలి. మరీ ముఖ్యంగా ప్రభుత్వం తరపు నుంచి మనుషులందరికీ సమ న్యాయం లభించాలి' అన్నది మానవ హక్కులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఇచ్చిన నిర్వచనం.

ఇస్లామ్ ధర్మం మానవ ప్రాణానికి అత్యంత పవిత్రతను, మనిషి గౌరవ మర్యాదలకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చింది. పుట్టుకతోనే మనిషికి దేవుడు గౌరవ మర్యాదలను ప్రసాదించాడు. ప్రేమ, ఆదరణ, గౌరవం, మర్యాద ఇవన్నీ మనిషి సహజత్వానికి నిదర్శనాలు. మనిషికి తన హక్కులు లభించాలి. గౌరవ మర్యాదలు దక్కాలి. ఇవన్నీ మనిషిని పుట్టించిన దేవుడు జన్మతః ప్రసాదించిన హక్కులు.

దేవుడిని నమ్మేవారైనా, నమ్మని వారికైనా ఈ ప్రపంచంలో అల్లాహ్ పెద్దరికాన్ని ప్రసాదించాడు. తన కారుణ్యంతో అన్ని వనరులను సమ కూర్చాడు. అందుకే ప్రపంచంలో పుట్టే ప్రతీ ప్రాణికీ పీల్చడానికి గాలి, నీరు, ఆహారం అన్నీ సమకూరుస్తున్నాడు. ఇదంతా మనుషులపై దేవుడి కారుణ్యం.

## ఇస్లామ్ ధర్మ బోధనల ప్రకారం మనుషులంతా సమానం

"ఇస్లామ్ బోధించే సోదరభావం, సమానత్వం కేవలం ముస్లిము లకే పరిమితం కాదు, మానవాళికంతటికీ వర్తిస్తుంది. జాతి, రంగు, కులం, మతం అనే భేదభావం లేకుండా అంతా సోదరులేనన్న భావన ఇస్లామ్ గొప్పతనానికి నిదర్శనం. ఇస్లామ్ ధర్మ బోధనలు ఆచరణీయం, అనుసరణీయం." అని ప్రముఖ రచయిత ఆర్ ఎల్. మిలమా వ్యాఖ్యానించారు.

జాతులైనా, తెగలైనా ఒకరిని ఒకరు గుర్తించుకోవడమే కానీ ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించడానికి కాదు. ఒకరి హక్కులు ఒకరు కాలరాసేందుకు అంతకన్నా కాదు. గర్వాన్ని ప్రదర్శించేందుకు ఎంత మాత్రం కాదు. ఒకరిని ఒకరు పరిచయం చేసుకునేందుకు, పరస్పరం సహాయ సహకారాల కోసమేననే విషయం ఖుర్ఆన్ స్పష్టం చేస్తుంది. తోటి మానవుల హక్కుల విషయంలో దైవానికి భయపడేవారే నిజమైన ధర్మ పరాయణులని ఇస్లామ్ ప్రబోధనలు స్పష్టం చేస్తున్నాయి.

"హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకు గాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపిన వాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడిన వాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే." (దివ్య ఖుర్ఆన్ 5 : 32)

అమాయకుల ప్రాణాలను తోడేయడం, హత్య చేయడం ఘోర పాపమని ప్రవక్త(స) హెచ్చరించారు. ప్రళయదినం నాడు అల్లాహ్ తన దాసుడితో "నేను అనారోగ్యానికి గురైతే నన్ను పరామర్శించ లేదు. నేను ఆకలితో ఉంటే నా ఆకలి తీర్చలేదు. నేను దప్పికతో ఉంటే నా దాహం తీర్చలేదు." అని ప్రశ్నిస్తాడు. అప్పుడు దాసుడు "ఓ అల్లాహ్ నీకు అనారోగ్యమేమిటి? నువ్వు ఆకలితో ఉండట మేమిటి? నీకు దాహం కలగటమేమిటి? నువ్వైతే సర్వ సృష్టికర్తవు అంటూ ఆశ్చర్యపోతాడు. అప్పుడు అల్లాహ్ "ఫలానా నా దాసుడు వ్యాధిగ్రస్తుడయ్యాడు, ఫలానా నా అతను ఆకలితో అలమటిం చాడు, దప్పికతో బాధ పడ్డాడు. ఆ రోజున నువ్వు వాళ్లకు సేవచేసి వాళ్ల ఆకలి తీర్చి, వాళ్ల దాహం తీర్చి ఉంటే ఆ రోజున వాళ్లలో నువ్వు నన్ను పొందేవాడివి" అని అల్లాహ్ సమాధానమిస్తాడు. తోటి మానవుల హక్కులను తీర్చడంలోనే దేవుడి హక్కులు నెరవేరతాయన్నది ఈ ఉపమానం ద్వారా ప్రవక్త స్పష్టం చేశారు.

ప్రపంచంలో తోటి మానవ హక్కులను కాలరాసేవాడే నిజమైన దరిద్రుడు అని చెప్పారు ప్రవక్త (స). డబ్బు దస్కం, ఆస్తిపాస్తులు, బ్యాంకు బ్యాలెన్స్ ఇవన్నీ ఉన్నప్పటికీ తోటి వారి హక్కులను కాల రాసేవాడే నిజమైన దౌర్భాగ్యుడని చెప్పారు. ప్రపంచంలో బతికుండగా ఒకరి హక్కులను కాజేసినందుకు ప్రళయ దినం నాడు అలాంటి వ్యక్తి నరకంలో పడవేయబడతాడు. నమాజ్, రోజా, హజ్, జకాత్ లాంటి దైవారాధనలన్నీ మనలో మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలి. మానవ హక్కుల రక్షణకు నిలువుటద్దంగా నిలవాలి.

ఒకసారి ప్రవక్త (స) మహనీయులు తమ సహచరులతో కూర్చుని ఉన్నారు. అంతలోనే ఒక మృతదేహాన్ని అంతిమ యాత్రగా తీసుకెళుతున్నారు. అది చూసి ఆయన వెంటనే లేచి నిలబడ్డారు. సహచరులు ఆయనతో "ప్రవక్తా, ఆ మృతదేహం ముస్లిమ్‌ది కాదు" అన్నారు. ప్రవక్త జవాబిస్తూ మనిషిదే కదా అన్నారు. (సహీ బుఖారి)

## నీతి, న్యాయం మానవ హక్కులకు పట్టుగొమ్మలు

ఒక వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరి సమానమైనది. (5:8)

విశ్వసించిన ప్రజలారా! న్యాయ ధ్వజ వాహకులుగా నిలబడండి. అల్లాహ్ కోసం సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదల యినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగ కండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని. (4:135)

దైవ ధర్మ సంస్థాపనతోనే మానవ హక్కులు రక్షించబడతాయి. దైవాన్ని గుర్తించకపోతే మనిషిలో మానవత్వమన్నది ఏ కోశానా మిగలదు. మనిషిలో మానవత్వం మాయమై మృగత్వం మేల్కొంటుంది. ఉన్మాదిలా మారిపోతాడు. ఓ సినీ కవి చెప్పినట్లు 'మాయమైపోతున్నడమ్మా మనిషన్న వాడు' అనేదే నిజమవుతుంది.

## మానవ హక్కులు... ఖుర్ఆన్ వాక్కులు

భూమిపై పుట్టిన ప్రతి మనిషికి స్వతంత్రంగా జీవించేందుకు కొన్ని హక్కులుంటాయి. జీవించడం అంటే గౌరవంగా జీవించడం అని స్వేచ్ఛ సమానత్వం సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయము ప్రతి వ్యక్తికి అందించాలని భారత రాజ్యాంగం బోధిస్తున్నది. మానవాళి హక్కుల పరిరక్షణకు, హక్కుల అణచివేత లేని సమాజ నిర్మాణం కోసం పాటుపడాలన్నదే ఖుర్ఆన్ బోధనల సారాంశం. ఖుర్ఆన్ మానవ హక్కుల ప్రకటనను ఈ సందర్భంగా ఒకసారి పరిశీలిద్దాం. ఇస్లామ్‌లో మానవ హక్కులను నెరవేర్చడం ఇస్లామ్ ధార్మిక విధిగా పేర్కొంటంది ఖుర్ఆన్.

న్యాయం చెయ్యండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడునూ, అశ్లీలతనూ, అన్యాయాన్నీ, మితిమీరి ప్రవర్తించటాన్నీ నిషేధిస్తు న్నాడు. ఆయన మీకు హితబోధ చేస్తున్నాడు, మీరు గుణపాఠం నేర్చుకోవాలని. (దివ్యఖుర్ఆన్ 16:90-91)

## గౌరవ మర్యాదల హక్కు

మేము ఆదమ్ సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము. వారికి నేలపై, నీటిలో నడిచే వాహనాలను ప్రసాదించాము. వారికి పరిశుద్ధమైన వస్తువులను ఆహారంగా ఇచ్చాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము. (దివ్యఖుర్ఆన్ 17:70)

## సమానత్వం

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసిన వాడూను. 49:13

## స్త్రీ - పురుషులు సమానమే

మంచి పనులు చేసేవారు - పురుషులైనా స్త్రీలైనా - వారుగనక విశ్వాసులైతే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవ్వంత అన్యాయం కూడా జరగదు. (4:124)

విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరి కొకరు సహచరులు, వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. నమాజును స్థాపిస్తారు. జకాత్‌ను ఇస్తారు. అల్లాహ్ పట్ల ఆయన ప్రవక్త పట్ల విధేయత పాటిస్తారు. వారి మీదనే అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పకుండా అవతరింపజేస్తాడు. (ఖుర్ఆన్ 9:71)

## అనాథల హక్కు కాజేసే వారికి హెచ్చరిక

అనాథుల ఆస్తిని అన్యాయంగా తినేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటారు. వారు తప్పకుండా మండే నరకాగ్నిలో త్రోయబడతారు. (ఖుర్ఆన్ 4:10)

## ప్రయాణించే హక్కు

అల్లాహ్ మీ కొరకు భూమిని పాన్పు మాదిరిగా పరిచాడు మీరు దానిపై ఉన్న విశాలమైన మార్గాలలో నడవటానికి వీలు కల్పిం చాడు. (71:19,20)

## జీవించే హక్కు

ఏ ప్రాణాన్నీ హత మార్చకండి న్యాయంగా తప్ప. (17:33)

"హత్యకు బదులుగాగాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకు గాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. (5:32)

## న్యాయాన్ని పొందే హక్కు

న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది. (దివ్య ఖుర్ఆన్ 5:8)

# ‘చరితార్థులు’-2



# అంజదీ బేగం

## (1885-1947)

**66**






**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**ఆంగ్ల ప్రభుత్వానికి** వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలలో పాల్గొంటున్న ‘ప్రమాదకర కుటుంబం’గా బ్రిటిష్ ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కిన సమరయోధుల కుటుంబ సభ్యురాలు అంజదీ బేగం, ఆమె ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం రాంపూర్ సంస్థానానికి చెందిన సంపన్న కుటుంబంలో 1885లో జన్మించారు. జాతీయోద్యమంలో బీబి అమ్మగా ప్రసిద్ధి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు ఆబాదీ బానో బేగం కుమారుడు, స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్‌ని ఆమె వివాహం చేసుకున్నారు. ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమం ద్వారా ఆమె కూడా మహాత్మా గాంధీ మార్గాన బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో ప్రవేశించారు. ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొనటం ద్వారా ప్రత్యక్ష రాజకీయాలతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ ఉద్యమ వ్యాప్తికి అత్తగారు, భర్త మౌలానా ముహమ్మద్ అలీతో కలసి పలు పర్యటనలు చేశారు. ప్రజల మనస్సులను ప్రభావితం చేయగల తన సంక్షిప్త ప్రసంగాలతో కార్యకర్తలను, ప్రజలను కార్యోన్ముఖులను చేశారు. మహాత్ముడు నిర్దేశించిన సత్యాగ్రహ ఆందోళనను విజయవంతం చేయడానికి ఆమె శక్తివంచన లేకుండా పని చేశారు. ఖిలాఫత్ కమిటీ–కాంగ్రెస్ కమిటీ నిర్ణయాల మేరకు విదేశీ వస్తువుల బహిష్కరణ, మద్యపాన నిషేధం, బ్రిటిష్ సైన్యంలో ఉద్యోగాలను, ప్రభుత్వ పదవులను, ప్రభుత్వ కళాశాలలను త్యజించటం తదితర కార్యకలాపాలలో అవిశ్రాంతంగా పాల్గొన్నారు. ప్రజలను, ప్రధానంగా మహిళలను సత్యాగ్రహాందోళన దిశగా ఆకర్షించేందుకు అత్తగారు, భర్త మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్‌తో కలిసి పలుచోట్ల పర్యటించారు. ఖిలాఫత్ – సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా మహాత్ముడు, మౌలానా సోదరులు కలిసి దేశవ్యాప్తంగా పర్యటించారు. జాతీయోద్యమ నిర్వహణకు అవసరమగు నిధుల సేకరణలో అంజదీ బేగం మంచి నేర్పరిగా గణుతికెక్కారు. జాతీయోద్యమంలో ఆమె నిర్వహిస్తున్న పాత్రను, ఆమె గుణగణాలను, ఆమె ధైర్య సాహసాలను, కార్యదక్షతను ప్రశంసిస్తూ మహాత్మాగాంధీ పలు లేఖలలో, చివరకు తన యంగ్ ఇండియాలో ప్రత్యేక వ్యాసాలు రాశారు. 1930లో ప్రథమ రౌండ్ టేబుల్ సమావేశానికి మౌలానా అలీతో కలసి అంజదీ బేగం కూడా లండన్ వెళ్ళారు. పరాయి ప్రభువుల నుండి స్వజనులను విముక్తం చేయడం లక్ష్యంగా శ్రమిస్తున్న భర్త లండన్‌లో అనారోగ్యానికి గురయ్యి కన్నుమూశారు. ఆపాటికి మౌలానా అలీ జాతీయ కాంగ్రెస్ నేతలకు దూరం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఆ కుటుంబాన్ని చుట్టుముట్టాయి. ఆ దుర్భర పరిస్థితులలో అంజదీ బేగం ఏమాత్రం అదరలేదు బెదరలేదు. జాతీయోద్యమ బాటలో నిరంతరం సాగుతున్న ఆమె తన పోరాటాన్ని విరమించలేదు. చివరి క్షణం వరకు స్వాతంత్ర్య సమరంలో తనదైన పాత్రను పోషిస్తూ ఆంగ్లేయులచే ‘ప్రమాదకర మహిళ’గా ముద్రపడిన అంజదీ బేగం 1947 మార్చి 28న చివరిశ్వాస విడిచారు. ✤

**కథ**

# సమైక్యతా రాగం

- షహనాజ్ బేగం, అనంతపురం



**ఆయిషా కూతురు హుస్నాకు పెళ్లి కుదిరింది.** పెళ్లి తేదీలు ఖరారయ్యాయి. ఇంట్లో పెళ్లి హడావుడి మొదలయ్యింది. ఆహ్వాన పత్రికలు అచ్చయ్యాయి. ఇతరత్రా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఆయిషా ఆమె భర్త సులేమాన్ పెళ్లికి పిలవాల్సిన వారి పేర్ల జాబితాను తయారు చేశాడు. ఆయిషా తన తరపు వారి జాబితాను తయారు చేసింది. తన మామయ్యలు, బాబాయిలు, అత్తయ్యలు, వారి పిల్లల పేర్లను కూడా లిస్టులో చేర్చింది.

తరువాత ఏదో గుర్తుకొచ్చినట్లు భర్తతో "అజీ, మరీ ముఖ్యమైన మా తండ్రి గారి ముఖ్య స్నేహితులు ఉన్నారు. ప్రసాద్ అంకుల్, రాయుడు అంకుల్, కృష్ణారెడ్డి అంకుల్, సుజాత ఆంటీ, సుశీల ఆంటీ వారి పిల్లలు. వాళ్లిప్పుడు పెరిగి పెద్దవారై మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నారట. వాళ్లందరినీ స్వయంగా పిలవాలి" చెప్పింది భర్తతో.

"సరే, అలాగే కానివ్వు. వాళ్ళతో మీ కుటుంబ స్నేహ సంబంధాలను చూశాను. మన పనులను ముగించుకుని రేపు బయలుదేరుదాము సరేనా. కర్నూలులో మన బంధువులందరినీ పిల్చి అటే అనంతపురం వెళ్దాం. వాళ్ళందరినీ చూసి చాలా కాలమైంది" అన్నాడు సులేమాన్.

ఇంట్లో అత్యవసర పనులన్నీ ముగించుకుని మరికొన్ని పనులను తన అన్నదమ్ములకు అప్పగించి బయలుదేరారు.

కర్నూలులో బంధువులందరినీ పెళ్లికి ఆహ్వానించి అనంతపురం బయలుదేరారు.

తన ఊరు దగ్గర పడ్తున్న కొద్దీ ఆయిషాలో ఎన్నో జ్ఞాపకాలు. ఎన్నో అనుభవాలు, అనుభూతులు గుర్తుకొస్తున్నాయి.

తన చిన్నప్పుడు అనంతపురంలో ఉన్నప్పుడు రాయుడు అంకుల్ ఇల్లు, తమ ఇల్లు ప్రక్కప్రక్కనే ఉండేవి. ఆ రెండు కుటుంబాలు ఎంతో కలిసిమెలిసి ఉండేవి. ఎలాంటి అరమరికలు ఉండేవి కావు. ఎంతో ఆపేక్షగా మాట్లాడుకునేవారు. తమ ఇంట్లో ఏ పండుగ జరుపుకున్నా ఆ రోజు వారింట్లో వంట చేసుకునేవాళ్లు కాదు. ఆ రోజంతా వాళ్ళందరికీ సరిపడేటంత వంటకాలను క్యారేజీ ద్వారా ఆ ఇంటికి చేరేవి. వాళ్ళకే కాదు తన తండ్రికి సన్నిహితులైన వారందరి ఇళ్ళకు క్యారేజీలు వెళ్లేవి.

వాళ్ళ ఇళ్లల్లో పండుగలు వచ్చినా ఆ రోజు తమ ఇంటికి ఎన్నో రకాల రుచికరమైన వంటకాలు చేరేవి.

ఎంతో ఆనందకరమైన అనుభూతులు అవి. ఆ విషయాలన్నీ తన భర్తతో పంచుకోసాగింది ఆయిషా.

ప్రసాద్ అంకుల్, కృష్ణారెడ్డి అంకుల్ విషయంలో అంతే. తన తల్లి చేసే ఫిల్టర్ కాఫీ అందరికీ ఇష్టమే.

'కాఫీ చేసి ఇవ్వమ్మా' అంటూ చనువుగా అడిగేవారు. తన తల్లికంటే వాళ్ళు వయసులో పెద్దవారయినా అక్కయ్య అంటూ పిలిచేవారు. వారందరినీ అన్నయ్య అని పిలిచేది మా అమ్మ.

ఒకరి  కష్టసుఖాలలో మరొకరు పంచుకునేవారు. అక్కడంతా సమైక్యతా రాగం, సమైక్యతా భావం వెల్లివిరిసేది. ఒకసారి తన తండ్రి ముఖ్య స్నేహితుడు కృష్ణమూర్తి అకస్మాత్తుగా చనిపోతే అతని భార్య ఒంటరిగా ఉందని తన తల్లిని ఆమెకు తోడుగా ఉండవల్సిందిగా పంపించాడు తన తండ్రి.

ఆ రాత్రివేళ ఆమెతోపాటు తన తల్లి కూడా అక్కడే ఉండి పోయింది.  భర్త పోయిన శోకంలో ఉండగా ఆమెకు అండగా నిల్చారు తన తల్లీ తండ్రి. తరువాత దూర ప్రాంతంలో ఉన్న అతని బంధువులు, అమెరికాలో ఉంటున్న వారి పిల్లలు వచ్చేవరకు తన తండ్రి  అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందించారు. వారి సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలకై అన్ని ఏర్పాట్లు కూడా చేసేశాడు.

అమెరికా నుంచి వచ్చిన అతని కొడుకు మహేశ్ తన తండ్రిని చుట్టేసుకుని ఏడ్వటం ఇప్పటికీ గుర్తుంది. అతనే కాదు అక్కడికి వచ్చిన బంధువులు అందరూ తన తండ్రిని ఎంతగానో కొనియాడారు.

అవన్నీ జ్ఞాపకమొస్తుంటే కళ్ళు చెమర్చాయి ఆమెకు.

తన పెళ్లి సమయంలో కూడా తన తండ్రి స్నేహితులందరూ అండగా నిలిచారు.  తమ ఇంట్లో తమ కూతురు పెళ్ళి చేస్తున్నట్లు అందరూ కలిసికట్టుగా ఉంటూ తలా ఒక బాధ్యతలను తీసుకుని పనులు చేశారు. ఒకరు షాదీఖానాను నిశ్చయం చేస్తే మరొకరు విందు భోజనానికై ఏర్పాట్లు చేశారు.  మిగతావాళ్ళు తమ చేతనైన పనులు చేస్తూ సహాయ సహకారాలు అందించారు.

ఆ రోజులే వేరు. భారంగా నిట్టూర్చింది ఆమె. తరువాత  తన తండ్రి కూడా  ఎక్కువ రోజులు బ్రతకలేదు.  కిడ్నీలు దెబ్బ తినడంతో వ్యాధిగ్రస్తుడై ఆయన చనిపోయారు.

ఆయన పోవటంతో  స్నేహితులందరూ అల్లాడిపోయారు. తమ కుటుంబ సభ్యులు ఎవరో పోయినట్లు బాధపడ్డారు.

ఆమె తండ్రి తరువాత ఒక్కొక్కరుగా వయోభారంతోనూ, అనారోగ్యాలతోను కొంతమంది స్నేహితులు పోయారు. ఇప్పుడు కొంతమంది అక్కడే ఉంటున్నారు.

అప్పుడెప్పుడో తన తండ్రి పాత ఫోన్ నంబర్లు గల డైరీని తీసుకుని వాటిలో నంబర్ల ప్రకారం వారందరికీ ఫోన్లు చేసింది.

వాళ్ళందరూ బాగా స్పందించారు. ఇప్పుడు ఇన్నేళ్ల తరువాత ఆ ప్రదేశానికి వెళ్తుంటే వారిని కలవబోతుంటే ఆమె ఉద్వేగ భరితు రాలవుతోంది.

★★★

చాలాకాలం తరువాత ఆమెను చూసి తమ కన్నబిడ్డను చూసినంత ఆనందపడ్డారు వాళ్ళు.

పోటీలు పడి ఆమెకు మంచి పసందైన ఆతిథ్యమిచ్చారు. కానీ వాళ్ళందరి ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతున్నారు. కానీ ఆనాటి ప్రేమాభి మానాలు, ఆత్మీయ అనురాగాలు మాత్రం చెక్కుచెదరలేదు.

ఇది కదా జీవితమంటే,  ఇది కదా మానవత్వం అంటే ... అనుకున్నది ఆమె. అక్కడ తరతమ అనే భేదభావం లేదు. వాళ్ళందరూ తప్పక తన బిడ్డ పెళ్లికి హాజరవుతామని చెప్పాక ఎంతో తృప్తిగా తిరుగు ప్రయాణమయ్యారు  ఆయిషా దంపతులు.

ఆయిషాకయితే తృప్తిగాను, గుండెల నిండా ఆనందంగానూ ఉంది. ఎప్పటికీ ఈ ప్రేమలు, అభిమానాలు ఇలాగే ఉండనివ్వు అంటూ ఆ దైవాన్ని ప్రార్థించుకుంది.

నగరంలో  తాము ఎదుర్కొంటున్న 'వెజిటేరియన్ వాళ్ళకు మాత్రమే ఇల్లు అద్దెకు ఇవ్వబడును' లాంటి సంస్కృతి ఇక్కడ రాకూడదని ప్రార్థించింది. మానవత్వం ఒక్కటే ఇక్కడ విరజిల్లాలి. ఎలాంటి భేదభావం ఉండకూడదు.

అంతటా సోదరభావమే కలిగి ఉండాలి అని కోరుకుంది.



అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది      ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

18–22 అతను అన్నాడు,[15] "అల్లాహ్ దాసుల్ని నాకు అప్పజెప్పండి,[16] నేను మీ కొరకు ఒక నిజాయితీ తత్పరుణ్ణయిన ప్రవక్తను.[17] అల్లాహ్‌ను ఎదిరించి తలబిరుసుతనం చూపకండి. నేను మీ సమక్షాన (నా నియామకానికి) స్పష్టమయిన ప్రమాణం సమర్పిస్తున్నాను.[18] మరి నేను నా ప్రభువూ, మీ ప్రభువూ అయినవాని రక్షణ పొందాను, మీరు నా పైన దాడి జరపకుండా ఉండేందుకు. మీరు నా మాటను నమ్మకపోతే సరే, నాపై చెయ్యి చేసుకోవడం విరమించుకోండి." కడకు అతను తన ప్రభువుకు మొరపెట్టుకున్నాడు, వీరు అపరాధులు అని.

15. ప్రారంభంలోనే ఒక విషయం తెలుసుకోవాలి. ఇక్కడ హజ్రత్ మూసా (అ) పలికిన మాటలను ఉటంకించడం జరిగింది. అవన్నీ ఒకే సమయాన ఒకే సందర్భంలో నిరంతర ఉపన్యాసంలోని అంశాలు కావు. అవన్నీ ఏళ్ళ తరబడి, విభిన్న సందర్భాలలో, ఆయన ఫిర్‌ఔన్, అతని సభాసదుల సమక్షంలో చెప్పిన విషయాలను సంక్షిప్తంగా క్లుప్తమయిన వాక్యాల్లో వివరించడం జరుగుతోంది. (వివరాలకు చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం.3, అల్ ఆరాఫ్: పాదసూచికలు 83–97 యూనుస్ : పాద సూచికలు 72–92 సం.4, తాహా: పాద సూచికలు 18అ – 53 సం.5, అష్ షు'అరా : పాద సూచికలు 7 – 48 అన్ నమ్ల్ : పాద సూచికలు 8–17 సం.6, అల్ కసస్: పాదసూచికలు 46–56 సం.7, అల్ మూ'మిన్: ఆయత్‌లు 23– 46, అజ్ జుఖ్‌రుఫ్: 46– 56 పాదసూచికలతో పాటు).

16. మూలంలో **"అద్దూ ఇలయ్య ఇబాదల్లాహి"** అన్న పదాలు ప్రయోగించబడ్డాయి. వీటికి ఒక అనువాదం మేము పైన చేసినది. దాన్నిబట్టి దీని భావం, ఆరాఫ్ (ఆయత్ : 105), తాహా (ఆయత్ : 47), అష్ షు'అరా (ఆయత్ 17)లో వచ్చిన కోరిక వంటిదే. అంటే "బనీ ఇస్రాయీల్‌ని నా వెంట వెళ్ళేందుకు వదలిపెట్టు" అన్నది. ఇక రెండవ అనువాదం హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ ఉటంకించింది. అది, "దైవదాసులారా, నా హక్కును నిర్వర్తించండి" అన్నది. అంటే నా మాట నమ్మండి, నన్ను విశ్వసించండి, నా మార్గబోధనను అనుసరించండి, ఇది దైవం పక్షాన మీపై నాకున్న హక్కు అని భావం. తరువాతి వాక్యం, "నేను మీ కొరకు ఒక నిజాయితీ తత్పరుణ్ణయిన ప్రవక్తను" అన్నది ఈ రెండవ భావానికి అత్యధికంగా అతుకుతుంది.

17. అంటే, విశ్వసనీయుణ్ణయిన దైవసందేశహరుణ్ణి. నా స్వంత మాట ఏదీ కల్పించి చేర్చి చెప్పేవాణ్ణి కాను. నేను నా స్వీయ ఆకాంక్షతో, లేదా స్వప్రయోజనం కోసం స్వయంగా ఒక ఆదేశం, లేదా చట్టం కల్పించి దైవం పేరుతో అందజేసే వాణ్ణీ కాను. నా పట్ల మీరు నమ్మకం కలిగి ఉండవచ్చు. నన్ను పంపినవాడు ఏదయితే చెప్పాడో దాన్నే ఎటువంటి హెచ్చుతగ్గుల్లేకుండా మీకు అందజేస్తాను (ఈ రెండు వాక్యాలు, మహనీయ మూసా (అ) ప్రారంభంలో తన సందేశాన్ని అందజేసినప్పటివి అన్న విషయం గుర్తుంచుకోవాలి).

18. మరో మాటలో దీని భావమేమిటంటే, నాకు ప్రతిగా మీరు చేస్తున్న తిరుగుబాటు, వాస్తవానికి ఇది అల్లాహ్‌కు ప్రతిగా చేస్తున్న తిరుగుబాటు. నేను చెప్పే ఏ మాటలకు మీరు ఆగ్రహం చెందతున్నారో అవి నావి కావు, అల్లాహ్ మాటలు. నేను ఆయనకు ప్రవక్తగానే వీటిని చెబుతున్నాను. నేను అల్లాహ్ చేత పంపబడిన వాణ్ణేనా కాదా అన్న విషయంలో మీకు ఏదయినా అనుమానం ఉన్నట్లయితే, నేను దైవం చేత నియమించబడినవాణ్ణే అనేందుకు స్పష్టమయిన ప్రమాణం అందజేస్తాను. ఈ ప్రమాణం అంటే ఏదయినా ఒక్క మహత్యం కాదు. మహత్యాల సుదీర్ఘమయిన పరంపర. అది ఫిర్‌ఔన్ దర్బారులో తొలిసారి వెళ్ళినప్పటి నుండి ఈజిప్ట్‌లో నివాసమున్న చివరి కాలం వరకు హజ్రత్ మూసా (అ) ఫిర్‌ఔన్‌కు అతని జాతి ప్రజలకు ఏళ్ళ తరబడి చూపిస్తూ ఉన్న మహత్యాలు. ఏ ఒక్క ప్రమాణాన్ని వారు కాదన్నా అంతకన్నా స్పష్టమయిన ప్రమాణం ఆయన అందజేస్తూ వచ్చారు. (వివరాల కోసం చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.7, అజ్ జుఖ్‌రుఫ్ : పాద సూచికలు 42, 43).

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
**(కితాబుల్ మగాజీ)**

## ఖైబర్ యుద్ధం

**96)** సలమా (రజి) ఇలా వివరించారు: హజ్రత్ అలీ(రజి) ప్రవక్త మహనీయుల (సఅసమ్)తోపాటు ఖైబర్ యుద్ధానికి వెళ్ళలేకపోయారు. ఎందుకంటే ఆ సమయంలో ఆయన కంటి జబ్బుకు గురై ఉన్నారు. కాని ప్రవక్త మహనీయులు(స) వెళ్ళిన తరువాత అలీ(రజి) ఆలోచనలో పడిపోయారు. నేను దైవప్రవక్త (స)తో కలసి యుద్ధంలో కూడా పాల్గొనలేనంత అశక్తుడుగా ఉన్నానా? అని అంతర్మథనం చెందారు. అందుకే ఆయన(రజి) కూడా కదన రంగానికి తరలి వచ్చారు. ఏ రోజున ఖైబర్ విజయం వరించనున్నదో, దానికి ఒక రోజు ముందు రాత్రి దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "రేపు నేను ఇస్లామీయ ధ్వజాన్ని ఎవరికి ఇస్తానో..." లేదా ఇలా అన్నారు: "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఎంతగానో ఇష్టపడే వ్యక్తికి రేపు నేను ధ్వజం ఇస్తాను. అతని చేతుల మీదుగానే విజయం వరిస్తుంది"– మాలో ప్రతి ఒక్కరూ ఈ భాగ్యం తమకే దక్కాలని ఆశించారు. కాని (మరునాడు జనులు) 'ఇదిగో అలీ వచ్చేశారు' అని చెప్పారు. దైవప్రవక్త(స) అలీ చేతికే ధ్వజం ఇచ్చారు. ఆయన చేతుల మీదుగానే విజయం వరించింది.

**97)** హజ్రత్ సహ్ల్ బిన్ సాద్(రజి) తెలిపారు: ఖైబర్ యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా సెల విచ్చారు : "రేపు నేను ఒక వ్యక్తి చేతికి జెండా ఇస్తాను. అతను అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను అమితంగా ప్రేమించేవాడై ఉంటాడు. అల్లాహ్, ఆయన ప్రవక్త కూడా అతన్ని ఎంతగానో ఇష్టపడతారు"–ఉల్లేఖకుడు ఇలా అన్నారు: ఆ రాత్రంతా అందరూ ఎంతో ఉత్కంఠతో గడిపారు. ఇంతకీ దైవప్రవక్త జెండాను ఎవరి చేతికి ఇస్తారా!? అని తీవ్రంగా ఆలోచించు కుంటూ ఉండిపోయారు. తెల్లవారాక అందరూ దైవప్రవక్త(స) చుట్టూ గుమి గూడారు. ఆ పతాకం తమకే దక్కుతుందని ప్రతి ఒక్కరూ ఆశించారు. కాని దైవ ప్రవక్త(స) ఆ ఉత్కంఠను ఛేదిస్తూ, "అలీ బిన్ అబీ తాలిబ్ ఎక్కడ?" అని ప్రశ్నిం చారు. 'దైవప్రవక్తా! ఆయన కళ్ళలో బాధ ఉంది' అని సమాధానం ఇవ్వబడింది. "అతన్ని పిలవండి" అని ఆదేశించారు ప్రవక్త మహనీయులు(స). అలీ (రజి) రాగానే, దైవప్రవక్త(స) తన లాలాజలాన్ని ఆయన(రజి) కళ్ళలో పూసి, ఆయన ఆరోగ్యం కొరకు దుఆ చేశారు. ఈ దుఆ (ప్రార్థన) ఫలితంగా ఆయన కంటి జబ్బు పూర్తిగా నయమైపోయింది. అసలు ఆయనకు అంతకు ముందు జబ్బు లేనట్లే ఆయన కళ్ళు నిర్మలంగా కనిపించాయి. అలీ(రజి) ధ్వజాన్ని చేబూనిన తర్వాత ఇలా విన్నవించుకున్నారు: 'దైవప్రవక్తా! వారూ మనలాగే పరివర్తన చెందనంత వరకూ నేను వారితో పోరాడతాను'. దానికి దైవప్రవక్త(స), "ఇలాగే ముందుకు సాగిపోండి. వారు మైదానంలోకి అడుగుపెట్టగానే మొదట వారికి ఇస్లామ్ సందేశం చేరవేయండి. అల్లాహ్‌కు వారిపై గల హక్కులేమిటో విశదీకరించండి. అల్లాహ్ సాక్షిగా! నీ ద్వారా ఒక్క వ్యక్తికి సన్మార్గం ప్రాప్తించినా అది నీ పాలిట ఎర్రని ఒంటెల కన్నా మేలైనది."[1]

97-1. ఈ హదీసు ద్వారా విదితమైనదేమంటే; యుద్ధం ఇస్లామ్ ప్రథమ ధ్యేయం కాదు. ధర్మపరిచయమే ఇస్లామ్ మొట్టమొదటి లక్ష్యం. అవతలివారు ధర్మపరిచయం తర్వాత ప్రభావితులై దేవుని ఏకత్వం (తౌహీద్) ముందు ఆత్మ సమర్పణ చేసుకున్నట్లయితే అప్పుడు యుద్ధం చేయటం ధర్మసమ్మతం కాదు. అల్లాహ్ కలహ కారకులను ఇష్టపడడని, ఆయన సదా న్యాయాన్ని, సంధిని, శాంతిని ఇష్టపడతాడని ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా చెప్పటం జరిగింది.

మహనీయ అలీ (రజి)ని ఖైబర్ విజేత అని ఎందుకంటారంటే, ఆయన చివరి ఘట్టంలో ఇస్లామీయ ధ్వజం అందుకున్నారు. ఆయన చేతుల మీదుగానే అల్లాహ్ ఖైబర్‌ను వశపరిచాడు. ఎర్రని ఒంటెలు అలనాడు అరేబియాలో విలువైన ఆస్తిగా భావించబడేవి.

# ఇస్లామీయ ఉద్యమం- ధర్మ సంస్థాపనం

**- ఎస్.ఎమ్.మలిక్**

**ఇస్లామీయ ఉద్యమాన్ని** పరిశీలించే ముందు దాని ఆవరణను పరికించవలసి ఉంటుంది. ఉద్యమం ఏదయినా అది మానవ జీవితాన్ని తప్పకుండా స్పర్శిస్తుంది. మరి జీవితం? అది సర్వ వ్యాపకం. దాని ప్రభావాలు వ్యక్తిగత స్థాయిలో మొదలయి సమాజాన్ని దాటి అంతర్జాతీయ స్థాయి వరకు వ్యాపించి ఉంటాయి. అయితే కొన్ని ఉద్యమాలు కేవలం మనిషి వ్యక్తిత్వ వికాసం కొరకు పని చేస్తాయి. మరి కొన్ని సామాజిక సంస్కరణలు ధ్యేయంగా కృషి చేస్తాయి. ఇంకా కొన్ని ఆర్థిక ప్రగతి పథంలో మనిషిని ముందుకు నడిపిస్తాయి. కాని ఇస్లామీయ ఉద్యమం అలా కాదు, అది జీవితాన్ని దాని సర్వ వ్యాపక రూపంలో ప్రభావితం చేస్తుంది. కారణం, ఇస్లామ్ దాని ఆవరణ సర్వ వ్యాపకమయినది!

### జీవితం అవిభాజ్యం

జీవితం మనిషిని పూర్తిగా పరివేష్టించి నడిపిస్తుంది. మనిషి ఆధ్యాత్మికంగా ఒక సైద్ధాంతిక దారిలో నడుస్తూ మరో సైద్ధాంతిక మార్గాన కాలిడి ఆర్థిక ప్రగతి కోసం పాటు పడటం సాధ్యం కాదు. ఇంకొక సైద్ధాంతిక దిశలో రాజకీయ రంగాన పురోగమించడం మరీ దుర్లభమయిపోతుంది. మనిషి తన జీవితాన్ని విభిన్న భాగాల్లో ముక్కలు చెక్కలు చేసుకుని జీవించలేడు. ఎందుకంటే జీవితం అవిభాజ్యం, ఒకే ఏకత్వం. అది సమగ్రంగా ఉంటేనే మనిషి ప్రశాంతంగా జీవన శకటాన్ని ముందుకు సాగనివ్వగలడు. లేదంటే విభిన్న దశల్లో ఆకర్షించే వివిధ జీవన రంగాలు అతని మనుగడను దుర్భరం చేసి వేస్తాయి.

ప్రపంచంలో చెలామణిలో ఉన్న జీవన విధానాల్లో ఏదయినా, అది పాశ్చాత్య విధానమయినా ప్రాచ్య విధానమయినా అవి మతపరమయిన అంశాలను ప్రాపంచిక వ్యవహారాల నుండి వేరు చేసి మరీ మాటలాడతాయి. కాని ఇస్లామ్ ఈ విభజనను అంగీకరించదు. జీవితాన్ని విభిన్న విభాగాల్లో విభజించడాన్ని సుతరామూ ఒప్పుకోదు. అది మానవ జీవితాన్ని ఒకే సమగ్ర సంపూర్ణ ఏకాంకం (Unit) గా పరిగణిస్తుంది. అలాగే ఆ సమగ్ర సంపూర్ణ జీవితానికి ఓ సమగ్ర సంపూర్ణ జీవన విధానాన్ని ప్రతిపాదిస్తుంది. ఇస్లామ్ సాధారణ పరిభాషలో మతం కాదు, అది నిజానికి దైవ విధేయతా మార్గం, సమగ్ర, సంపూర్ణ, సర్వజనీన ధర్మం, జీవన విధానం.

### ఇస్లామ్ - ఉద్యమం

ఇస్లామ్ వాస్తవానికి పరిపూర్ణ ధర్మం. వ్యక్తికయినా సమాజానికయినా పరిపాలనా వ్యవస్థకయినా సమంగా వర్తించే పరిపూర్ణ, సమగ్ర దైవభక్తి ప్రధానమయిన జీవన విధానం. అది దైవిక ధర్మం కావటాన దాన్ని సంస్థాపించేందుకు కృషి సలపడం అవశ్యం. ఈ ధర్మాన్నే వ్యక్తి పైన, సమాజం పైన, రాజకీయ వ్యవస్థ పైన నెలకొల్పడం అవసరం. అలా నెలకొల్పడం ఓ వ్యక్తి వల్లనో లేదా కొందరు వ్యక్తుల వల్లనో సాధ్యం కాదు. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో దానిగ్గాను దీర్ఘ కాలిక ఉద్యమం ఒకటి అవసరం.

నిజానికి ఇస్లామ్ ఏదో స్తబ్ధ నిశ్చల మతం కాదు. అది జీవితంతో పాటు ప్రగతి పథాన పురోగమించే ఒక సమగ్ర ఉద్యమం, సర్వ వ్యాపక ఉద్యమం, ధార్మిక ఉద్యమం. ఈ ధర్మ సంస్థాపనం దైవాదేశం ద్వారా ముస్లిమ్ సముదాయం పైన విధిగా నియోగించడం జరిగింది. మరి ఈ ధర్మ సంస్థాపనా కృషి కేవలం సాముదాయికంగా, సంఘటితంగా, ప్రణాళికా బద్ధంగా మాత్రమే సాధ్యమవుతుంది. అందువల్లనే దిగువ ఆయత్‌లలో సామూహిక కృషినే కోరడమయినది.

**1) ఇదే విధంగా మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ సమాజంగా చేశాము. తద్వారా మీరు ప్రపంచ ప్రజలకు సాక్ష్యంగా నిలువాలనీ**

మరి దైవప్రవక్త మీకు సాక్షి కాగలగాలనీను.

(అల్ బకర 2 : 143)

**2) మీలో ఒక వర్గం తప్పకుండా ప్రత్యేకమయి ఉండాలి, వారు మంచి వైపునకు ఆహ్వానించాలి, సత్కార్యాలను ఆదేశించాలి, చెడులను నిరోధించాలి. (ఆలి ఇమ్రాన్ 3 : 104)**

**3) ఇక పై ప్రపంచంలో ఉత్తమమయిన సముదాయం మీరే, మిమ్మల్ని మానవుల సంస్కరణ కొరకు ప్రత్యేకించడం జరిగింది. మీరు మంచిని చెయ్యమని ఆదేశిస్తారు, చెడుల నుండి నిరోధిస్తారు, దైవాన్ని విశ్వసిస్తారు. (ఆలి ఇమ్రాన్ 3 : 110)**

అలా జరిగినప్పుడే మానవ ప్రగతీ వికాసాలు, సమాజ నిర్మాణం, (విభిన్న సామాజిక సంస్థల స్థాపన), రాజకీయ వ్యవస్థ రూపకల్పన, అన్నీ ధర్మ సంస్థాపనలో భాగంగానే, సుసంఘటిత సాముదాయిక వ్యవస్థగా, ప్రణాళికా బద్ధమయిన నిరంతర కృషి ద్వారా సాధ్యమవుతాయి.

## వ్యక్తియే ప్రధానం

దివ్య ఖుర్‌ఆన్‌లో నిజానికి వ్యక్తినే సంబోధించడమయినా, ఆదేశించడమయినా, ఆశించడమయినా, సర్వం వ్యక్తినే ప్రధానంగా చేసి జరుగుతుంది. ఎందుకంటే ప్రపంచంలో మనిషి సామూహిక కృషి సలప వలసి ఉన్నా పరలోకంలో, దైవ సన్నిధిలో నిజానికి వ్యక్తినే ప్రశ్నించడం జరుగుతుంది. ఆచరణలకు ప్రతిఫలం వ్యక్తిగతంగానే ప్రదానం చేయడమూ జరుగుతుంది. సాముదాయిక కృషి జరపడం కూడా వ్యక్తుల ద్వారానే సాధ్యం. అందువల్ల వ్యక్తియే ప్రధానం, వ్యక్తినే ప్రశ్నించడం జరుగుతుంది. వాస్తవానికి మానవుని సంబంధం వ్యక్తిగతంగా దైవంతో పటిష్ట పడనంతవరకు, మనిషి వ్యక్తిగతంగా లోనుంచి మారనంతవరకు, దైవాదేశాల పాలన, వ్యక్తిగత స్థాయిలోనూ సామూహిక స్థాయిలోనూ సంభవం కాదు.

అందువల్లనే ప్రథమంగా మార్పు రావలసింది వ్యక్తిలోనే. సామూహిక వ్యవస్థల్లో, శాసనసభల్లో కాదు. మరో విషయం ఏమిటంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలంటే మానవుణ్ణి మానవుని దాస్యం నుండి విముక్తం చేయడం. అదే నిజమయిన స్వాతంత్ర్యం. మనిషి కళ్ళు తెరిచి పరిశీలించాలి, బుద్ధినుపయోగించి స్వేచ్ఛగా నిర్ణయాలు చేయగలగాలి. నిజమయిన మానవత్వ పరిరక్షణ ఇలాగే సాధ్యం.

## ధర్మం లేదా జీవన వ్యవస్థ

మానవ సృజన కేవలం తన సృష్టికర్త, స్వామి, ప్రభువు, దైవాన్ని ఆరాధించేందుకు మాత్రమే జరిగింది:

“నేను జిన్నుల్నీ మానవుల్నీ కేవలం నా ఆరాధన, దాస్యం చేయడానికే సృష్టించాను.” (అజ్ జారియాత్. 51: 56)

మరి ఈ ఆరాధన, దాస్యం చేయవలసిన మార్గం చూపడం విశ్వ ప్రభువు పైనే ఉంది:

“నిస్సందేహంగా దారి చూపడం మా బాధ్యత.”

(అల్ లైల్ 92 : 12)

“ఓ ప్రవక్తా! నీవయితే కేవలం హెచ్చరించేవాడివి మాత్రమే, (అలాగే) ప్రతి జాతికి ఒక మార్గదర్శి ఉన్నాడు.”

(అర్రాద్ 13: 7)

పై ఆయత్‌ల ద్వారా తెలిసే విషయం, యావత్తు జీవితం దైవారాధనగా రూపొందాలన్నది దేవుని ఉద్దేశం అని, అదే మానవుని నిజ ధర్మం అనీను. ఆ నిజ ధర్మాన్ని బోధించే బాధ్యత దైవానిదే అని కూడా తెలుస్తోంది. ఆ బాధ్యతను దైవం తన సందేశహరులయిన, మానవుల మార్గదర్శకుల ద్వారా నెరవేర్చాడని కూడా ద్యోతకమవుతోంది. ఇంకా ప్రతి మానవ


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

సముదాయానికి, జాతికీ మార్గదర్శకులు వచ్చారని కూడా తెలుపడం జరిగింది. అలా వచ్చిన మార్గదర్శకులందరూ ఒకే మార్గాన్ని బోధించారు. ఆ మార్గమే దైవ విధేయతా ధర్మం, ఇస్లామ్.

"దైవ సన్నిధిలో అంగీకృత (గుర్తింపు పొందిన) ధర్మం ఇస్లామ్ మాత్రమే." (ఆలి ఇమ్రాన్ 3 : 19)

ఇస్లామ్ చివరి దైవ సందేశంగా, దైవ ధర్మానికి చివరి ఎడిషన్‌గా, చివరి దైవ ప్రవక్త ద్వారా పంపబడిన ధర్మం. ఇంకా దాన్ని పరిపూర్ణంగా, దేవుని అంగీకారం, సమ్మతి పొందిన ధర్మంగానూ పంపడం జరిగింది:

**"ఈ రోజున మీ ధర్మాన్ని మీ కొరకు నేను పరిపూర్ణం గావించాను, మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా మీ కొరకు ఇస్లామ్‌ని మీ ధర్మంగా సమ్మతించి ఆమోదించాను."**

**(అల్ మాయిద 5 : 3)**

ఈ వచనాల ద్వారా తెలిపిన దాన్ని బట్టి ఇస్లామ్ సందేశాన్ని అందజేసిన గ్రంథం, దివ్య ఖుర్ఆన్ చివరి దైవ గ్రంథం, కడపటి (Final) మార్గ బోధన అనీ, దీన్ని మానవాళికి అందజేసిన ప్రవక్త ముహమ్మద్ (స) కూడా చివరి ప్రవక్త అనీ తెలుస్తోంది.

**"కాని ఆయన దేవుని సందేశ హరులు, ప్రవక్తలలో కడపటి వారు." (అల్ అహ్జాబ్ 33 : 40)**

**"ఈ దైవ విధేయతా ధర్మం (ఇస్లామ్) తప్ప మరో విధానాన్ని ఎవరు అవలంబించ కోరినా అతని ఆ విధానాన్ని స్వీకరిం చడం జరగదు." (ఆలి ఇమ్రాన్ 3 : 85)**

అందువల్ల ఈ సమగ్ర, సంపూర్ణ ధర్మాన్ని వ్యక్తిగత సామూహిక జీవన రంగాలన్నింటిలో అనుసరించడమే ధర్మ సంస్థానం :

**"ఆయన మీ కొరకు అదే ధర్మ విధానాన్ని నిర్ధారించాడు, దాని ఆదేశమే ఆయన నూహ్‌కు ఇచ్చాడు. దాన్నే(ఓ ముహమ్మద్!) మేము ఇప్పుడు నీ వైపునకు వహీ ద్వారా పంపాము. దాన్నే మేము ఇబ్రాహీమ్‌కు, మూసాకు, ఈసాకు బోధించి ఉన్నాము. (వారందరికీ) ఈ ధర్మాన్ని సంస్థాపించాలని, అందులో విభిన్నం కారాదనీను తాకీదు చేశాము." (అష్ షూరా 42 : 13)**

ఇది కేవలం ప్రవక్తల బాధ్యత కాదు, కడపటి ప్రవక్త తరువాత మరే ప్రవక్త రాబోవటం లేదు కాబట్టి అది ఆయన అనుయాయులయిన ముస్లిమ్ సముదాయం ప్రథమ విధి, బాధ్యత :

**"ఇంకా ఈ విధంగానే మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ సముదాయంగా చేశాము, మీరు ప్రపంచ ప్రజలకు సాక్షులుగా నిలువాలనీ ఇంకా దైవ సందేశహరులు మీకు సాక్షిగా కాగలగాలనీను." (అల్ బకర 2 : 143) ఇంకా :**

**"ఇకపై ప్రపంచంలో మీరే ఉత్తమమయిన సముదాయం, మిమ్మల్ని మానవుల మార్గబోధనకు, సంస్కరణ కొరకు ప్రత్యేక పరచడం జరిగింది. మీరు మంచిని బోధిస్తారు, చెడును నిరోధిస్తారు, దైవాన్ని విశ్వసిస్తారు." (ఆలి ఇమ్రాన్ 3 : 110)**

## విధి నిర్వహణ

నేటి పరిస్థితుల్లో సంభవిస్తున్నదంతా ఈ విధిని విస్మరించడం, దాని పట్ల ఏమరుపాటు వల్లనే అన్నది స్పష్టంగా కానవస్తోంది. నేడు ప్రపంచం జీవన విధానాలన్నింటి పట్ల నిరాశకు గురయి ఉంది. ఇప్పుడు ముస్లిమ్ సముదాయం బాధ్యత మరీ ముఖ్యంగా పెరుగుతుంది. వారు దైవం ప్రసాదించిన ధర్మం ఇస్లామ్‌ను ప్రపంచానికి పరిచయం చేయవలసి ఉంది. నిజానికి ఈ ఉద్యమ నిజ ధ్వజ వాహకులు ముస్లిమ్ సముదాయమే. వారికి వారి విధినీ బాధ్యతనూ గుర్తు చేయడం మన బాధ్యత. ముస్లిములు జనుల సమక్షంలో దైవ ధర్మానికి సాక్షులుగా నిలువడాన్ని వారికి గుర్తు చేయాలి. వారు మానవులలో ప్రత్యేక పరచబడిన వారని గుర్తు చేయాలి.

ఈ ఉద్యమ ధ్వజవాహకులు మూడు విషయాలకు కట్టుబడి ఉన్నారు :

## దైవ భక్తి (Godliness)

- మన సృష్టి కర్త, స్వామి, ప్రభువుకు విధేయమయిన జీవితం.
- ఆయన మార్గ బోధన ఆవశ్యకత.

ఆ మార్గ బోధననే జీవితంలో అనుసరించడం.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పొదరాయి
గీటురాయి
వారపత్రిక

- మానవత పునాదిగా వ్యవస్థ (System based on Humanity):

- మనం అనుసరించే దైవ విధేయమయిన జీవన విధానంలో జాతి, కులం, వర్గం, వర్ణం, భాష, దేశం, వంటి విభేదాలకు తావు ఉండరాదు.

- ఆ విధానం సైద్ధాంతికమయినదే కాని జాతి పరమయినది కాదు.

- అందులో మానవులంతా సమాన హక్కులు గలవారయి ఉంటారు.

## ప్రజాస్వామ్యం (Democracy)

- సామాన్య ప్రజలు నోరు విప్పడం పైన ప్రతిబంధకాన్ని విధించే వ్యవస్థ పట్ల వ్యతిరేకత.

- అభిప్రాయ ప్రకటనకు స్వేచ్ఛ కావాలి.

- జీవితంలో, ముఖ్యంగా సామూహిక జీవితంలో!

- కొన్ని వర్గాలకు ప్రత్యేక హక్కులు, మరి కొందరిపై ప్రత్యేక ఆంక్షలు ఉండరాదు.

## మనం ప్రజాస్వామిక సారం (Essence)ను కాపాడాలి.

ధర్మ సంస్థాపనకు సామూహిక శక్తి అవసరం. ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజాభిప్రాయ శక్తి ఆధారంగానే ఏదయినా సాధించ డానికి వీలవుతుంది. అందువల్ల మన సామూహిక ధ్యేయ సాధనకు కృషి చేసే వారి మధ్య పరస్పరం:

- చిత్తశుద్ధితోపాటు ప్రేమాభిమానాలు అవసరం.

- నాయకత్వంలోని మంచీచెడుల విచక్షణ, గుర్తింపు కూడా అవసరం.

- కార్యాచరణ విధానం వివేచన విచక్షణలతో కూడినదయి ఉండాలి.

## ఉద్యమ కార్యకర్త

ఒక విషయాన్ని మనం మరువరాదు, అజ్ఞాన కాలంలో మంచిని ప్రేమించి మంచినే ఆచరించేవారు ఇస్లామ్‌లో కూడా మంచివారు గానే మెలుగుతారు. ప్రవక్త(స) ప్రవచనం ఒకటి దీన్నే సూచిస్తుంది. ఇటువంటి నైతిక శక్తి ఆధారంగానే ఒకనాటి ముస్లిమ్ యోధులు సింధు నదీ ఒడ్డు నుండి అట్లాంటిక్ మహా సాగర తీరాల వరకు ఇస్లామ్ సందేశాన్ని వ్యాపింపజేశారు, ఆ నేలనంతా శాంతి యుతంగా ఇస్లామీయ పరిపాలనా వ్యవస్థను స్థాపించ గలిగారు. అది కేవలం ఆశల వల్ల, కోరికల వల్ల, బాహ్య పటాటోపం వల్ల సాధ్యమయిందా?


ఆ మహానుభావులు, ఒక్కొక్కరూ శుభానికీ, శ్రేయానికీ తాళం చెవులూ మార్గదర్శకులూ అయ్యారు, దౌష్ట్యానికీ దుర్మార్గానికీ తాళాలూ పరమ విరోధులూ అయ్యారు! అప్పుడే అదంతా సాధ్యమయింది. విలాసవంతమయిన మనుగడ, ప్రాపంచిక లాలసతో నిండిన జీవితం గడిపినట్లయితే మొరాకో నుండి ఇండోనేషియా వరకు ఇస్లామీయ జీవన విధానాన్ని ప్రవేశపెట్ట గలిగేవారు కారు!!

ఉత్తమ సముదాయం అన్నా, మధ్యస్థ సముదాయం అన్నా అదే మరి! ఆ సముదాయం అపూర్వమయిన త్యాగ నిరతిని సమర్పించుకుంటుంది. ఇవే కదా ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తల లక్షణాలు. వారు ఇస్లామ్ కొరకు ధన ప్రాణాలు, సమస్త సుఖ భోగ విలాసాలు వదలుకున్న త్యాగధనులు! సాహస వంతులూ సహనమూర్తులు. ధర్మోన్నతియే జీవన ధ్యేయంగా జీవించిన వారు, దైవ దాస్య భావనకు సర్వం సమర్పించుకున్న వారు!!

వారిలో అహంభావం, గర్వం, ప్రదర్శనాబుద్ధి, సంకుచిత హృదయం, సంకల్ప బలహీనత, హృదయ కాపట్యం వంటి రోగాలు ఏ కోశానా కానరావు. అయినప్పటికీ ఆత్మ పరిశీలన, ఆత్మ విమర్శల ద్వారా తనను తాను సంస్కరించుకుంటూ ఇతరులకూ పిలుపు నివ్వాలి. అలాగే పరస్పర పరిశీలన, పరస్పర విమర్శల ద్వారా స్వీయ శిక్షణ, సోదర శిక్షణ జరుపుకుంటూ ఉండటం ఎంతో అవసరం.

ఉద్యమం వ్యక్తి ప్రధానంగా వ్యక్తుల ఆధారంగా ఎన్నడూ పురోగమించ జాలదు. ఇస్లామీయ ఉద్యమం వ్యక్తులకు ఎన్నడూ ప్రాముఖ్యత నివ్వలేదు. వ్యక్తులు, నాయకులు వస్తూ పోతూ ఉంటారు, కార్యకర్తలకు అసలు సిద్ధాంతం పట్ల, ధ్యేయం పట్ల ప్రేమాభిమానాలు ఉంటే వారు ఎటువంటి నిరాశకూ గురి కారు. విశ్వాస బలహీనతకు లోనవకపోతే, నిరంతర కృషి, చిత్తశుద్ధితో వేడుకోలు అర్పించుకుంటూ ఉంటే దైవం సర్వాన్నీ చక్కబెడతాడు.

అటువంటి వారి ద్వారానే ధర్మ సంస్థాపనం సాధ్యమవుతుంది!



# BIMARU రాష్ట్రాల్లో ముస్లిం ప్రాతినిధ్యం

**- సల్మాన్ హైదర్**

**నూతనంగా వెలువడిన Muslims in India - Ground Realities versus Fake Narratives అనే పుస్తకం ప్రకారం ముస్లిం అధికారుల సంఖ్య బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో సంఖ్యాపరంగా అల్పంగా ఉంది.**

ఈ పుస్తకం నాలుగు రాష్ట్రాలలో (బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్) ప్రభుత్వం, పరిపాలనలో ముస్లిముల ప్రాతినిధ్యం గురించి వెల్లడించింది. బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు రాజకీయంగా కీలకమైనవి అయితే ఆర్థిక వృద్ధి, ఆరోగ్య సంరక్షణ, విద్య, తలసరి ఆదాయంలో వెనుకబడి ఉన్నాయి.

2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ మొత్తం జనాభాలో 41 శాతం కంటే ఎక్కువ మంది ఈ నాలుగు రాష్ట్రాల్లో నివసిస్తు న్నారు. 1980ల ప్రారంభంలో వీటిని బీమార్ (అనారోగ్యం) అని జనాభా శాస్త్రవేత్త ఆశిష్ బోస్‌చే ఆ రాష్ట్రాల పేద ఆర్థిక, సామాజిక, జనాభా వృద్ధిని పరిగణనలోకి తీసుకోవడం వలన పిలువబడినవి.

నాలుగు బీమారు/ BIMARU రాష్ట్రాలలో మూడు 2000లో విభజించబడ్డాయి- జార్ఖండ్ బీహార్ నుండి, ఉత్తరాఖండ్ ఉత్తరప్రదేశ్ నుండి, ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్ నుండి విభజించ బడ్డాయి. అధిక జనాభా పెరుగుదల రేట్లు, తక్కువ అక్షరాస్యత రేట్లు, అధిక శిశు, మాతా మరణాల రేట్లు, తక్కువ తలసరి ఆదాయం, అధిక పేదరిక స్థాయిలు, సరిపోని మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లో అధిక అవినీతి, కులతత్వం, మతతత్వం, రాజకీయ అస్థిరత వంటి అత్యంత తీవ్రమైన సవాళ్లను కూడా ఎదుర్కొంటున్నాయి.

ప్రభుత్వ, సామాజిక శాస్త్రవేత్తల అనేక అధ్యయనాలు ఈ రాష్ట్రాలు (బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్) ఇతర రాష్ట్రాలతో, ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలతో చాలా వెనుకబడి ఉన్నాయని సూచించాయి. ముఖ్యంగా బీహార్ గత అర్థ శతాబ్దంలో సామాజిక, ఆర్థిక అభివృద్ధి నిచ్చెనలో అట్టడుగున ఉన్నది.

ఈ నాలుగు రాష్ట్రాల్లోని పోలీసు బలగాల్లో ముస్లింలకు తక్కువ ప్రాతినిధ్యం ఉంది.

బీహార్‌లోని 59 మంది ఎస్పీలు, ఏఎస్పీలలో ముగ్గురు మాత్రమే ముస్లింలు. SDPOలు, DSPలు 148 మందిలో నలుగురే ముస్లింలు ఉన్నారు.

ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు (లా అండ్ ఆర్డర్, క్రైమ్) 1,259 మందిలో 43 మంది ముస్లిములు.

ఉత్తరప్రదేశ్‌లో 305 మంది ఎస్పీలు, ఏఎస్పీలలో ఆరుగురు మాత్రమే ముస్లింలు.

ఉత్తరప్రదేశ్‌లో 736 మంది SDPO, DSPలలో 27 మంది ముస్లిములు.

ఉత్తరప్రదేశ్‌లోని 1,631 ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు (లా అండ్ ఆర్డర్, క్రైమ్)లో 12 మంది మాత్రమే ముస్లింలు.

మధ్యప్రదేశ్‌లో 139 మంది ఎస్పీలు, ఎఎస్‌పిలలో ఒక్క ముస్లిం మాత్రమే కలరు.

మధ్యప్రదేశ్‌లో 238 మంది ఎస్‌డిపిఓ, డిఎస్‌పిలలో ఆరుగురు మాత్రమే ముస్లిములు ఉన్నారు.

మధ్యప్రదేశ్‌లో 1,376 మంది ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు (లా అండ్ ఆర్డర్, క్రైమ్స్)లో ఇరవై ఐదు మంది ముస్లింలు ఉన్నారు.

రాజస్థాన్‌లో మొత్తం 248 మంది ఎస్పీలు, ఏఎస్పీలు ఉన్నారు. వారిలో ఐదుగురు ముస్లిములు కలరు.

రాజస్థాన్‌లో మొత్తం 550 మంది SDPO, DSPలలో 20 మంది ముస్లిములు కలరు.

రాజస్థాన్‌లో మొత్తం 2726 మంది ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు (లా అండ్ ఆర్డర్, క్రైమ్స్)లో 88 మంది ముస్లింలు కలరు.

## రాష్ట్ర పోలీసు సర్వీస్‌లో...

బీహార్‌లో 369 మంది అధికారులలో 33 మంది ముస్లిములు.

మధ్యప్రదేశ్‌లోని 886 రాష్ట్ర పోలీసు సర్వీస్ అధికారుల్లో కేవలం ఏడుగురు మాత్రమే ముస్లింలు.

ఉత్తరప్రదేశ్‌లోని 1,057 రాష్ట్ర పోలీసు సర్వీస్ అధికారుల్లో కేవలం 35 మంది ముస్లింలు.

## స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో...

బీహార్‌లో 1,111 మంది అధికారులలో 71 మంది ముస్లిములు ఉన్నారు.

మధ్యప్రదేశ్‌లోని 114 మంది అధికారుల్లో 10 మంది మాత్రమే ముస్లింలు.

ఉత్తరప్రదేశ్‌లో 1,057 మంది రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారుల్లో 35 మంది ముస్లింలు ఉన్నారు.

2023 సివిల్ లిస్ట్‌ల ప్రకారం రాజస్థాన్‌లోని 933 స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారులలో 41 మంది ముస్లింలు ఉన్నారు.

రాష్ట్ర కేబినెట్‌లు, సీఎంఓలలో ముస్లింల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇందులో ఉప ముఖ్యమంత్రులు, క్యాబినెట్ మంత్రులు, రాష్ట్ర మంత్రులు (స్వతంత్ర బాధ్యతలు), రాష్ట్ర మంత్రులు ఉన్నారు.

బీహార్‌లోని తొమ్మిది మంది క్యాబినెట్ మంత్రులలో, ఏ ఒక్క ముస్లిం లేరు, అయితే సీఎం కార్యాలయంలో 19 మంది అధికారులలో ఒక ముస్లిం ఉన్నారు

ఉత్తరప్రదేశ్‌లోని 56 మంది మంత్రుల్లో ఒక ముస్లిం ఉండగా, సీఎంఓలో 38 మంది అధికారుల్లో ముస్లింలు లేరు.

25 మంది సభ్యులతో కూడిన రాజస్థాన్ క్యాబినెట్‌లో ముస్లింలు లేరు, సిఎంఓలోని ఐదుగురు అధికారులలో ముస్లింలు లేరు.

## ముస్లింల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి : బీసీ కమిషన్‌కు జేఐహెచ్ వినతి



ముస్లింల సమగ్ర అభివృద్ధి కోసం వారి జనాభా దామాషాను అనుసరించి రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జమాఅతె ఇస్లామి హింద్ (జేఐహెచ్) జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా బీసీ కమిషన్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ముస్లింల సమగ్ర అభివృద్ధికి జనాభా దామాషా ప్రకారమే కాకుండా రాజకీయ రిజర్వేషన్లను కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని తాము సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా రిజర్వేషన్లు అమలు చేసి ముస్లిం మైనార్టీల ప్రాతినిధ్యం పెంచాలని కోరారు. అదేవిధంగా కుల గణనలలో ముస్లిం మైనార్టీల కోసం ప్రత్యేకంగా బిసి-బి,ఈ కాలాన్ని నిర్వహించాలని సూచించారు. మైనార్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఉపకార వేతనాలను అందజేసేదని, ఇటీవల ఆ స్కాలర్‌షిప్‌లను నిలుపుదల చేశారని, ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఒకటి నుండి పదవ తరగతి వరకు ఉపకార వేతనాలను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామీ హింద్ ఖిల్లా అధ్యక్షులు అబ్దుల్ మలిక్, ఇంద్రనగర్ అధ్యక్షులు అబ్రార్ అలీ పాల్గొన్నారు.

నాలుగు రాష్ట్రాల్లోని (బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్), రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌లకు అధ్యక్షులు లేదా సభ్యులు, కార్యదర్శులు, రిజిస్ట్రార్లుగా మొత్తం 135 మందిలో ఒక్క ముస్లిం కూడా లేరు.

నాలుగు రాష్ట్రాల్లోని రాష్ట్ర మహిళా కమిషన్‌ల పరిస్థితి కూడా భిన్నంగా లేదు.

నాలుగు రాష్ట్రాల్లోని లీగల్ సర్వీసెస్ అథారిటీలు కూడా వారి ర్యాంకుల్లో స్వల్ప సంఖ్యలో ముస్లింలను కలిగి ఉన్నాయి. 287 మంది కార్యనిర్వాహక అధ్యక్షులు, సభ్యకార్యదర్శులు, సభ్యులు మరియు సీనియర్ అధికారులలో 17 మంది మాత్రమే ముస్లింలు.

నాలుగు రాష్ట్రాల్లోని వాణిజ్య పన్నుల శాఖలో 3,442 మంది అధికారుల్లో 67 మంది మాత్రమే ముస్లింలు ఉన్నారు - మధ్యప్రదేశ్‌లో ముస్లింలు లేరు.

రెవెన్యూ శాఖలలో, బీహార్, రాజస్థాన్‌లలో 184 మంది అధికారులు ఉన్నారు, వీరిలో ఒక ప్రత్యేక కార్యదర్శితో సహా 15 మంది ముస్లింలు ఉన్నారు.

నాలుగు రాష్ట్రాల్లో కార్మిక శాఖల్లో 247 మంది అధికారులుండగా కేవలం 11 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు.

నాలుగు రాష్ట్రాల్లో డ్రగ్ కంట్రోల్, ఇన్‌స్పెక్షన్ టీమ్‌లలో 354 మంది అధికారులలో ముస్లింల సంఖ్య 15 మాత్రమే - మధ్యప్రదేశ్‌లో ముస్లింలు లేరు.

స్టేట్ ప్రాసిక్యూషన్ డిపార్ట్‌మెంట్ల విషయానికి వస్తే ముస్లిముల పరిస్థితి మెరుగ్గా లేదు.

నాలుగు రాష్ట్రాల్లో ప్రాసిక్యూషన్స్, అడ్వకేట్ జనరల్స్‌లోని ఆరుగురు హెడ్‌లలో, ఎవరూ ముస్లిం కాదు.

217 మంది అదనపు ఏజీలు, గవర్నమెంట్ ప్లీడర్లు, స్టాండింగ్ కౌన్సెల్‌లలో కేవలం 19 మంది ముస్లింలు. రాజస్థాన్‌లో అసలు లేరు.

బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలోని ఎక్సైజ్/ నిషేధ శాఖల నిర్వహణ, తనిఖీ బృందాల్లోని 999 మంది అధికారులలో 36 మంది మాత్రమే ముస్లింలు.

రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో అవినీతి నిరోధక శాఖలో 103 మంది అధికారులలో ఆరుగురు ముస్లింలు ఉన్నారు.

నాలుగు రాష్ట్రాల పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్లలో మొత్తం 3,948 మంది అధికారుల్లో 177 మంది మాత్రమే ముస్లింలు.

బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లలో మేనేజ్‌మెంట్ టీమ్‌లు, సీనియర్ అధికారులు సంఖ్య 626, అందులో 11 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు.

నాలుగు రాష్ట్రాల్లోని అటవీ శాఖల్లో సీనియర్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న మొత్తం 1,104 మందిలో ముస్లిం అధికారులు 14 మంది ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక్క ముస్లిం కూడా ర్యాంక్‌లో లేరు.

## వైద్యులు

నాలుగు రాష్ట్రాల్లో (బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్), ఆయుర్వేద వైద్యుల సంఖ్య 54,252 కాగా, అందులో 147 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు.

నాలుగు రాష్ట్రాల్లో (బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్)లోని 16,534 మంది యునానీ వైద్యుల్లో 16,116 మంది ముస్లింలు.

హోమియోపతి వైద్యుల సంఖ్య 58,120 మంది అందులో 20,366 మంది ముస్లింలు ఉన్నారు.

1953-2022 మధ్య బీహార్ మెడికల్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న MBBS వైద్యుల సంఖ్య 47,028గా ఉంది, అందులో ముస్లింలు 4,483.

మధ్యప్రదేశ్‌లో 1960-2022 మధ్య 1,922 మంది ముస్లింలతో సహా మొత్తం 42,102 మంది వైద్యులు ఉన్నారు.

రాజస్థాన్‌లో మొత్తం 49,242 మంది డాక్టర్లలో ముస్లింల సంఖ్య 1,379.

ఉత్తరప్రదేశ్‌లో 1960- 2022 మధ్య మొత్తం 93,563 మంది వైద్యులలో 5,640 మంది ముస్లిం వైద్యులు కలరు.

## లోకాయుక్త

బీహార్‌లో ఇప్పటివరకు ఉన్న 10 లోకాయుక్తలలో ఒకరు మాత్రమే ముస్లిం.

మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఒక్కొక్క ముస్లిం ఉప లోకాయుక్తగా ఉండగా, వారి సిబ్బందిలో 24 మందిలో ఒక ముస్లిం కూడా లేరు.

ఉత్తరప్రదేశ్ ఏడు లోక్ అయుక్తలో ఒక ముస్లిం ఉన్నారు, అయితే ఉప లోక్ అయుక్తగా లేదా దాని సీనియర్ అధికారులుగా ముస్లింలు లేరు.

## ముఖ్యమంత్రులు

బీహార్‌లోని 23 మంది ముఖ్యమంత్రులలో ఒకరు మాత్రమే ముస్లిం -1973-1975లో అబ్దుల్ గఫూర్.

మధ్యప్రదేశ్‌లో మొత్తం 29 మందిలో ఏ ముస్లిం కూడా ముఖ్యమంత్రి లేదా ఉప ముఖ్యమంత్రి కాలేదు.

(నవంబర్-26 రాజ్యాంగ దినోత్సవం - భారత రాజ్యాంగ అమృతోత్సవ నేపథ్యం)




## కే. లక్ష్మణ్ గౌడ్

**జాతి** భవిత నిర్దేశ మార్గదర్శి
జవసత్వాలు ఉద్దీపింపజేసే జీవనాడి
జాతీయత – సర్వజన సంక్షేమం అంతర్లీనంగా ప్రవహించే జీవధార
స్వేచ్ఛా స్వతంత్రాల వరప్రదాయిని
ప్రజాస్వామ్యంలో పరిఢవిల్లే లౌకిక పునాది
భిన్న వర్గాల సమదృష్టి– రాజ్యాంగ వెన్నెముక
రాజకీయ సంక్షోభాల నిర్మూలించే పరిష్కర్త
పార్లమెంటు నిర్వహణ ప్రాతిపదిక చట్టసభల దిశానిర్దేశం చేసే మార్గదర్శి
నిష్కళంక న్యాయదేవత నిర్దేశించే సమగ్ర నిఘంటువు
ప్రగతి రథచక్రాలు పరిగెత్తించే అభ్యుదయ పథగామి
పౌరసత్వ లక్షణాల్ని శాసించే రాజపత్రం
మేధావుల చింతనలో ఆవిష్కృత సార్వజనీన మూలగ్రంథం
విభిన్న వర్గాల వైరుధ్యాల సమరస భావనలు ప్రోత్సహించే శాంతి మంత్రం
వైవిధ్యంలో సాన్నిహిత్యం సాధించే ఆదర్శప్రదాయిని
భిన్నత్వంలో ఏకత్వం సూత్రీకరించే మనోనేత్రం
హక్కుల్ని బాధ్యతల్ని నిర్వచించి నిర్దేశించే పథగామి
అరాచక శక్తుల మంత్రాంగంలో కొరవడిన రాజ్యాంగ స్ఫూర్తి
వితండ వాదాల వ్యాఖ్యానాలు – ప్రాథమిక లక్షణాల దెబ్బతీసే స్వార్థచింతనలు
అక్రమార్కుల ఖండించి నిలదీసే శిక్షాస్మృతి
మహామహుల దీక్షతో సాకారమైన 'భారత రాజ్యాంగం'
భరతజాతి భావితరాలకు పటిష్ట ఆధార పీఠం




**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**అల్లాహ్ తన దయతో వారికి ప్రసాదించిన అనుగ్రహానికి గాను అసూయ పడుతున్నారా? (అన్ నిసా: 54)**

అసూయ అంటే, ఒకరికి దక్కిన వరానుగ్రహాన్ని చూసి ఓర్వలేని తనంతో - అది వారికి దక్కకుండా నశించాలి అని కోరుకోవడం. అన్నారు ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యిమ్ (రహ్మ).

అసూయ లేక ఈర్ష్య పెద్ద పాపాల కోవకు చెందినది. ఈర్ష్య మూలంగానే షైతాన్ తొలిసారిగా అల్లాహ్‌ను ధిక్కరించాడు. ఖాబిల్ తన సోదరుడైన హాబిల్‌ని అసూయతోనే హత్య చేశాడు. దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) సోదరులు ఆయన యెడల చేసిన చెడు వ్యవహారానికి అసలు కారణం ఈ అసూయే. యూద పండితులు, అబ్దుల్లాహ్ బిన్ ఉబై వంటి కపటులు మహా ప్రవక్త (స) పట్ల చేసిన కపట చేష్టలన్నింటికీ మూలం ఈర్ష్యే. ఇది విశ్వాసానికి విరుద్ధాంశం. అందుకే దీనికి దూరంగా ఉండమని మహనీయ ముహమ్మద్ (స) చాలా గట్టిగా తాకీదు చేశారు.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త(స) ప్రబోధించారు: "అసూయకు దూరంగా ఉండండి. ఎందుకంటే అగ్ని కట్టెలను భస్మీపటలం చేసినట్లే అసూయ సత్కార్యాలను హరించి వేస్తుంది." (అబూదావూద్)

అసూయ అగ్ని వంటిది. ద్వేషమూ అంతే. ఏ కర్ర నిప్పు ఆ కర్రనే కాల్చినట్టు-, ఎవరు అసూయాపరులో, వారినే అసూయా ద్వేషాలు దహిస్తాయి. ఇది నిత్య సత్యం.

### త్రిగుణ సంగమం మానవ దేహం

మనిషి శరీరాన్ని త్రిగుణాలు ఆవరించి ఉంటాయి. సత్వ, రజో, తమో గుణాలు. అయినా ఈ త్రిగుణాల ప్రభావం వల్ల మనిషి స్వభావం మారుతూ ఉంటుంది.

కర్మణస్సుకృతస్యాహు స్వాత్వికం నిర్మలం ఫలమ్

రజసస్తు ఫలం దుఃఖ మజ్ఞానం తమసః ఫలమ్

సత్వగుణముతో ఉన్న వారు చేసే సాత్వికమైన కర్మలకు నిర్మల మైన ఫలము లభిస్తుంది. రజోగుణముతో ఉన్న వారు చేసే కర్మలకు దుఃఖము కలుగుతుంది. తమోగుణముతో కూడిన తామస కర్మలు చేసే వారికి అజ్ఞానము, అవివేకము ఎక్కువవు తుంది.

ఈ లోకంలో ప్రతి ఒక్కరికీ సుఖ పడాలనే కోరిక ఉంటుంది. సుఖ పడటానికి మార్గాలు ఎన్నో ఉన్నాయి. ఎవరూ దుఃఖ పడాలని కోరుకోరు. కాబట్టి ఏయే పనులు చేస్తే సుఖం కలుగుతుందో ఆయా పనులనే చేయాలి. దుఃఖం కలిగించే పనులు చేయకూడదు. కేవలం సాత్విక కర్మల చేతనే సుఖం కలుగుతుంది. రజోగుణము, తమోగుణము, ఉన్న కర్మలు చేస్తే దుఃఖము, అజ్ఞానము, మోహము, కలుగుతాయి. కాబట్టి వాటిని వదిలిపెట్టి సాత్విక కర్మలవైపు అడుగులు వేయాలి.

రజోగుణము వలన దుఃఖం ఎందుకు వస్తుంది అంటే కామము, క్రోధము రజోగుణ ప్రధానములు. కామం మనిషిని మనిషిలో

ఉండే విచక్షణను మరిచిపోయేలా చేస్తుంది. కామానికి బానిస అయినవాడు వావి వరుసలు చూడడు. ప్రస్తుత కాలంలో ఎక్కడపడితే అక్కడ, వయసుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుండి ముసలివాళ్ళ వరకు అత్యాచారాలకు గురవుతు న్నారు. కామం వల్ల ఇలా జరిగితే రజోగుణంలో మరొక భాగం అయిన కోపం మనిషిని నిలకడగా ఉండనివ్వదు. చీటికీ మాటికి కోపం చేసుకోవడం వల్ల అపార్థాలు చోటుచేసుకుంటాయి. కోపం ఉన్నచోట ఏ బంధం ఎక్కువకాలం నిలబడదు. రగిలి పోతున్న మంట ముందు ఎవరూ ఎక్కువసేపు కూర్చోరు కదా!! కోపం ఉన్న మనిషి కూడా రగిలిపోతున్న మంటలాంటి వాడే. మంట అన్నిటినీ కాల్చి బూడిద చేసినట్టు కోపం ఎక్కువున్న మనిషి ఎదుటివారిని గాయపరుస్తూ ఉంటాడు. అందుకే కామం, క్రోధం రెండూ మొదట్లో సుఖాన్ని ఇచ్చినా చివరకు దుఃఖం మిగుల్చు తాయి.

ఇక తమోగుణము వలన మోహం కలుగుతుంది. మోహం కలిగిన వాడికి ముందు వెనుక ఆలోచనలు ఉండవు- అన్నీ సొంతమ వ్వాలనే మొండితనం మూర్ఖత్వం తప్ప. ఎలాగైనా తనకు కావాల్సింది తను సాధించుకునే స్వభావం ఇందులో ఉంటుంది. అన్నీ తప్పుడు నిర్ణయాలు తీసుకుంటారు. దానివలన హాని కలుగుతుంది. కాబట్టి దాసులు, సాధకులు ఈ రెండు గుణములను అంటే రజోగుణం, తమోగుణం వదిలి పెట్టాలి.

మనిషి తన జీవితంలో సంభవించే భావోద్వేగాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుంటాడు. తనకు సంతోషకరమైన, లాభదాయకమైన కార్యం సిద్ధిస్తే- మనసు ఆనందంతో ఉండి ఉరకలేస్తూంటుంది. ఆ సంతోషాన్ని కుటుంబంతో, మిత్రులతో పంచుకొంటాడు. అదే వ్యక్తికి కొంచెం ఏమాత్రం కష్టం వచ్చినా, నష్టం కలిగినా, మనసు వ్యాకులపడుతూంటుంది. అప్పుడు మనం ప్రవర్తించే తీరు మరొక రకంగా ఉంటుంది.

## అంతర్గత శత్రువు అసూయ

ప్రతి వ్యక్తీ గొప్పవాడు కావాలని కలలు కంటుంటాడు. ఇది సహజం. కానీ, అందరికన్నా గొప్పవాడు కావాలని కొందరు ఆరాట పడతారు. అలా కావటానికి చేతనైన అన్ని రకాల విధానాలూ అనుసరిస్తారు. దేనికైనా తెగిస్తారు. కొందరు విశేషంగా ధనం సంపాదించి, తాము గొప్పవారమనే భ్రమతో గర్విస్తారు. మరికొందరు హోదా లభించగానే అధికార దర్పం, అహంకారం ప్రదర్శిస్తారు. ఇది కూడా ఆధిక్యతా భావం వల్లనే! కొందరు తమకంటే అందరూ తక్కువ స్థాయిలోనే ఉండాలని కోరుకుం టారు. తమను ఎవరు మించి పోతున్నా భరించలేరు. అసూయతో రగిలిపోతారు. అవకాశం లభిస్తే, ఏదోవిధంగా, తమ కన్నా అధికులకు అపకారం చేస్తారు. వారికి కష్టనష్టాలు కలిగి నప్పుడు, లోలోపల సంతోషపడుతూ, పైకి సానుభూతి ప్రకటిస్తారు.

అల్లాహ్ ఇలా హితవు పలుకుతున్నాడు: . నీ ప్రభువు కారుణ్యాన్ని వీరు పంచుతున్నారా? (వారికా అధికారం ఉందా?) ఐహిక జీవితంలో కావలసిన ఒనరుల్ని నేనే వారి మధ్యన పంచిపెట్టాను. కాకపోతే పరస్పరం సేవాసహకారాలకై వారిలో కొందరికి కొందరిపై ఆధిక్యత ఇచ్చాను. అయితే నీ ప్రభువు కారుణ్యం వారి ధనికులు కూడబెడ్తున్నదాని కంటే ఎంతో విలువయినది.

(అజ్-జుఖ్రుఫ్: 32)

తనకున్నదానితో తృప్తిపడే వానికి ఎన్నడూ అసంతృప్తి ఉండదు. ఉండడానికి ఇల్లు, కట్టుకోడానికి బట్ట, తినడానికి తిండి, జీవనానికి ఢోకా లేని ఆదాయం ఉన్న.వ్యక్తికి అసంతృప్తి ఉండే అవకాశం లేదు. ఏ ఒక్కరి జీవితం కూడా వడ్డించిన విస్తరిలా లేదు. కష్ట నష్టాలు భరించడానికి సంతోషంగా సిద్ధం కావాలి. అప్పుడే జీవితంలో మాధుర్యం ఆస్వాదించగలుగుతాం.

ఎవరికి, ఏది, ఎంతవరకూ దక్కాలో అది ముందుగానే నిర్ణయించ బడుతుంది. దాన్ని ఆనందంగా అనుభవించటమే మన విధి. ఒకరు ఎంత కష్టపడినా లభించనిది, మరొకరు తేలికగా పొందడా నికి గల కారణం కూడా ఇదే.అయితే మనకింతవరకే ప్రాప్తం అని సరిపెట్టుకోవడమే అన్నివిధాలా మంచిది. ఈర్ష్యా, అసూయ, ద్వేషం మొదలైనవాటిని ప్రదర్శించకూడదు. అలా చేయడం వలన ఆశించినది దక్కకపోగా మనశ్శాంతి కూడా కరువవుతుంది. ఈర్ష్య, అసూయా ద్వేషాలను పెంచుకుంటే అవి అవతలవారికంటే ఎక్కువగా మనకే నష్టాన్ని కలుగచేస్తాయి. ఆశించినది ఎంతైనా, అందులో దక్కింది కొంతే అయినా సంతృప్తి చెందాలి. ఈర్ష్య, అసూయలను పెంచుకోవటమంటే మన సంతోషాన్ని మనం చంపుకోవటమే!

మనకు లభించినదానికి సంతోషించాలి ఎదుటి వారికి లభించినది చూసి ఎన్నడూ అసూయ పడకూడదు. ఎంతటి భయంకరమైన వ్యాధులకైనా మందులు ఉన్నాయి. కాని, అసూయ అనే వ్యాధి సోకిన వారికి మందులు లేవు. అసూయా పరులు తమ జీవితాంతం అసంతృప్తితోనే ఉంటారు. ఎక్కడ అసూయ ఉ ంటుందో అక్కడ సుఖ సంతోషాలు ఉండవు. విషం కన్నా ప్రమాదకరమైనది అసూయ. విషం తీసుకున్న మనిషి కొంతసేపు వేదనతో మరణిస్తాడు కాని అసూయకు లోనైనవారు అనుక్షణం జీవితాంతం మరణిస్తూనే ఉంటాడు. అసూయకు లోనైన వారు ప్రశాంత జీవితం గడుపలేరు. ఎప్పుడూ కోపంతో రగిలిపోతూ ఉంటారు.

**(మిగతా వచ్చేవారం)**




**దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: విద్యను అభ్యసించటం ప్రతి స్త్రీ, పురుషునిపై విధిగా చెయ్యబడింది. (ఇబ్నెమాజా)**

ఇంకా ఇలా సెలవిచ్చారు : జ్ఞానవంతుల ఉపమానం ఈ ధరణిపై నక్షత్రాల వంటిది. ఆ నక్షత్రాల ద్వారా భూమిపైనా, సముద్రాల లోను ఉండే చీకటిలో మార్గదర్శకత్వం లభిస్తుంది. ఒకవేళ ఈ నక్షత్రాలు గనక మటుమాయమైతే మార్గం తప్పిపోయే పరిస్థితి ఏర్పడుతుంది (ముస్నద్ అహ్మద్). విద్యాకాంతుల ద్వారానే అల్లాహ్ మానవులకు మార్గాన్ని చూపుతాడు.

విద్య మనిషికి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. చీకటివేళలలో కాంతిని ప్రసాదిస్తుంది. విద్య మనిషికి శక్తిని ప్రసాదిస్తుంది. ఆ శక్తి ద్వారా అతను తన జీవితాన్ని విశాలమైనదిగానూ, తన వ్యక్తిత్వాన్ని ఉన్నతమైనదిగానూ తీర్చిదిద్దుతాడు. ఒక విద్యావంతుడు తన వరకు తన ఇంటి వారి వరకు పరిమితంగా ఉండడు. దానికన్నా ముందుకు అడుగులు వేస్తాడు. గతంలో కూడా తొంగిచూస్తాడు. భవిష్యత్తును కూడా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తాడు. అంతేకాదు, విశాల విశ్వంపై దృష్టిని సారిస్తాడు. తన శక్తిమేరకు పరిశోధనలు ప్రారంభిస్తాడు. ఒక కాంతి మాదిరిగా, ఆ కాంతి వేగాన్ని కూడా తన శక్తిమేరకు అనుసరిస్తూ తన పరిశోధనా ప్రయాణాన్ని ప్రారంభిస్తాడు. చివరకు ఆ మైదానంలో అతని శక్తిమేరకు విజయాన్ని కూడా సాధిస్తాడు. ఇదీ విద్యా జ్ఞానాల ప్రాముఖ్యత.

విద్యలేని మనిషి అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడతాడు. విద్యలేని సమాజం అంధకారంలోను, కటిక చీకటిలోనూ మగ్గుతుంది. ఆ సమాజం ఎలాంటి పురోగతిని సాధించజాలదు.

ఆందోళన, భయం, చింతన, అసంతృప్తి, వ్యాకులత చెందే సమయాలలో విద్య జ్ఞానం ఆత్మ బంధువుగాను, అపరిచిత వాతా వరణంలో మంచి స్నేహితునిగాను, ఒంటరి సమయాలలో సన్నిహితునిగాను, సంతోష సమయాలలో, దుఃఖ సమయాలలో మార్గదర్శిగానూ, శత్రువుకు వ్యతిరేకంగా ఆయుధంగానూ, హరామ్ హలాల్‌ల వ్యత్యాసాన్ని చూపే గీటురాయిగానూ, ధర్మాన్ని అనుసరించటంలో దిశా నిర్దేశనం చేసేదిగాను తోడ్పడుతూ ఉంటుంది.

జ్ఞానం మనిషికి అల్లాహ్ తరపు నుంచి లభించిన అనుగ్రహాల న్నింటిలో పెద్ద అనుగ్రహం. అది అత్యంత విలువైనది. ఇంకా ఈ సర్వసృష్టిలోని మహిమల్లోని ఒక పెద్ద మహిమ కూడాను. దాని ద్వారా మనిషికి అల్లాహ్ గౌరవాన్ని ప్రసాదించాడు, ఉన్నత శిఖరాలకు చేర్చాడు. కాని మనం విద్య గురించి అంతగా ఆలోచించము. దాని విలువను గ్రహించము. విద్యను అభ్యసించే మార్గంలో పయనిస్తూ ఉన్నా దాని ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకోకుండా రోజూ జరిగే ఒక కార్యక్రమంగా అతి తేలికగా తీసుకుంటాము. అంతేకాదు, విద్యను రెండు విధాలుగా విభజిస్తాము. ఒకటి ప్రాపంచిక విద్య అని, రెండోది ధార్మిక విద్య అని. వాస్తవానికి రెండూ జీవిత శకటానికి చెందిన రెండు చక్రాలు. ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్నవి.ఒకదానితో మరొక దానికి ఎన్నటికీ విడదీయనటువంటివి.

సృష్టి ప్రారంభం నుంచే విద్య ప్రారంభమయింది. ఆ విద్య ద్వారానే ఈ ప్రపంచం ఆనాటి నుండి క్రమక్రమంగా అభివృద్ధి పథంలో నడుస్తూ ఈనాటి వరకు ఇంతగా అభివృద్ధి చెందింది. ఏ విధంగానైతే పలు ప్రాంతాలలో, పలు జాతులలో ఉన్న భాషలు ఎంతగా విలువైనవో పలు రకాల విద్యలు కూడా అంతే ప్రాముఖ్యమైనవి.

అల్లాహ్ హజ్రత్ ఆదమ్(అ)ను సృష్టించి ఆయనకు సృష్టితాల పేర్లను, దానికి సంబంధించిన జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆ తరువాత వచ్చిన ప్రవక్తలందరికీ గ్రంథాలను, జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఈ విధంగా చివరి దైవప్రవక్త ముహమ్మద్(స) గారికి ప్రవక్త పదవిని ప్రసాదించినప్పుడు మొట్టమొదట విద్యనే ప్రసాదించబడింది. దీనిద్వారా తెలిసిన విషయమేమిటంటే అల్లాహ్ మనుషుల్ని పుట్టించి వారిని కారుచీకట్లలో కొట్టుమిట్టాడానికి ఇట్టే వదిలివేయలేదు. మనిషి సృష్టి ప్రారంభించినప్పటి నుంచే విద్యాకాంతులలోనే అతని జీవిత ప్రయాణాన్ని ప్రారంభింపజేశాడు. కాలానుగుణంగా అవసరాననుగుణంగా ఆ విద్యను అవతరింపజేస్తూనే ఉన్నాడు. అంతేకాదు మనిషి దానిని నేర్చుకుని ఆ కాంతిలో పయనించే ఏర్పాట్లు కూడా చేశాడు. ఆ విద్యను జ్ఞానంగా మార్చుకోవటానికి బుద్ధినీ ప్రసాదించాడు. మంచీచెడుల విచక్షణా జ్ఞానాన్ని, అభివృద్ధి పథంలో దూసుకుపోవటానికి కావలసిన సకల సదుపాయాలను ప్రసాదించాడు. అల్లాహ్ ఇంతగా ఏర్పాట్లు చేసినా ఎవరైనా తెరచి ఉంచవలసిన కళ్ళను చూడకుండా మూసి ఉంచుకుంటానంటే, వినటానికి ఇవ్వబడిన చెవులు కూడా మూసుకుంటానంటే, బుద్ధీజ్ఞానంపై అజ్ఞానపు పరదానే కప్పుకుంటానంటే, ఈ విధంగా నిరక్షరాసునిగానే జీవితం గడుపుతానంటే అలాంటి వానికి ఎవరూ ఏమీ చెయ్యలేరు.

విద్య అనేది ఒక మహావృక్షం వంటిది. దాని ద్వారా వెలువడే రెమ్మలు, కొమ్మలు ఒక విశాలమైన ప్రదేశాన్ని తన అధీనంలోకి తీసుకుంటాయి. తన కొమ్మల ఛాయల్లో ప్రజలకు నీడను, ప్రశాంతతను, సుఖాన్ని, ఆరోగ్యాన్ని, ఆహారాన్ని ప్రసాదిస్తాయి. దాని కారణంగా దాని పేరుప్రఖ్యాతలు బహుదూరం వ్యాపిస్తాయి. ప్రపంచ ప్రజలందరూ దానివైపు మొగ్గు చూపుతారు. దాని నీడలో సేద తీరాలనుకుంటారు. ఆ నీడలో ఇతరులు కూడా ప్రయోజనం పొందాలని ఇతరులను కూడా ఆహ్వానిస్తారు. ఈ మహా వృక్షం ద్వారా ప్రయోజనం పొందేవారికి దాని ఒక్కొక్క ఆకు, ఒక్కొక్క అణువు ఎంతో ముఖ్యమైనదిగా అనిపిస్తుంది. ఆ మహా వృక్షం ఆపాద మస్తకం కాంతిపుంజం. వివేకులు ఒక్కొక్కరు ఒక్కొక్క తరపు నుండి ఒక్కొక్క విధంగా ఆ కాంతి కిరణాలు పొందే ప్రయత్నం చేస్తారు. కాని అవివేకులు అంతటి లాభకారి అయిన వృక్షాన్ని తన ముందు పెట్టుకుని కూడా తన కళ్ళను మూసుకుంటారు. కనుకనే అల్లాహ్ విద్యను అభ్యసించటం అందరిపై విధిగా చేశాడు. ఒకవేళ ఎవరైనా ఈ విధిని నెరవేర్చక పోతే అల్లాహ్‌కు సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. మరొక విషయం ఏమిటంటే, విద్యను అభ్యసించటానికి ఇస్లామ్ వయసును పరిమితం చెయ్యలేదు. పైగా తల్లి ఒడి నుండి సమాధికి పోయేవరకు విద్యను అభ్యసిస్తూనే ఉండండి అని ప్రోత్సహించింది.

మనిషి జీవిత గమ్యంలో ఎన్నో పనులు కొంత సమయం వరకు చేస్తూ ఉండినా ఆ తరువాత వాటి అవసరం ఉండదు. కనుక వాటిని విడిచిపెట్టడం జరుగుతుంది. కాని విద్య అనేది ఎలాంటిదంటే మనిషి జీవిత గమ్యంలో ఎక్కడున్నా, ఏ స్థితిలో ఉన్నా విద్యను అభ్యసిస్తూనే ఉండాలి. తాను నేర్చుకున్నది ఇతరులకు నేర్పుతూనే ఉండాలి. ఇది తప్పనిసరిగా చేయవలసింది. దీనికి విరామం ఎంతమాత్రమూ లేదు. ఈ విషయాన్ని గనక అర్థం చేసుకుంటే దానికి విరామ అవసరమూ ఉండదు. మరొక విషయం ఏమిటంటే విద్యను నేర్చుకోవటం అంటే జీవితాంతం ఏ పాఠశాలకో వెళ్ళి నేర్చుకోవటం అని కాదు. కొన్ని సంవత్సరాల వరకు మనిషి స్కూలుకు, కాలేజీకి వెళ్ళి చదువుకుంటాడు. ఆ తరువాత అతనికి ఇంకా అక్కడికి వెళ్ళే అవసరం ఉండదు. ఒక కోర్సు ఏదైనా సరే అది అయిపోయిన తరువాత అతని కోసం ఆ పాఠశాలల ద్వారాలు ఇంకా తెరచి ఉంచబడవు. ఆ విద్య పూర్తయి పోతుంది. చాలామంది ఇక మా చదువు పూర్తయి పోయింది అని ప్రశాంతంగా కూర్చుంటారు. ఇక తమ జీవిత కార్యక్రమాలలో మునిగిపోతారు. దీనిద్వారా జరిగేదేమిటంటే కొన్ని సంవత్సరాల తరువాత చదువుకున్న విషయాలకు తుప్పు పట్టిపోతుంది. చివరకు ఆ చదువు అంతా క్రమక్రమంగా తనలో నుంచి కనుమరుగైపోతుంది.

చదువుకున్న ప్రతి వ్యక్తి ఒక దీపం లాంటివాడు. ఒకసారి ఆ దీపం వెలిగితే అది ఇంకా ఇంకా వెలుగుతూనే ఉండాలి. దానికి కావలసిన ఇంధనం తయారవుతూనేఉండాలి. అది ఆ దీపానికి లభిస్తూనే ఉండాలి. ఆ దీపం ఎల్లప్పుడూ వెలుగుతూనే తన చుట్టూ ఉన్న ప్రజలకు కాంతిని ప్రసాదిస్తూనే ఉండాలి. ఒకవేళ ఆ దీపానికి కావలసిన ఇంధనం తయారుకాకపోతే దానికి అందకపోతే అది మెల్లిమెల్లిగా ఆరిపోతుంది. తుప్పు పట్టి మూలన పడిపోతుంది. ఆ తరువాత అది తన విలువను మొత్తం కోల్పోతుంది.

కనుక ప్రతి మనిషి నిత్య విద్యార్థిగా ఉండాలి. క్రమక్రమంగా జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండాలి. నవయువతను తాను తీర్చిదిద్దే ప్రయత్నం చెయ్యాలి. తన జీవిత గమ్యమేమిటో తెలుసుకోవాలి. తన జీవితాన్ని, ఇతరుల జీవితాన్ని ఇహపర లోకాల సాఫల్య మార్గాల వైపునకు తీసుకువెళ్ళాలి. ❖




## డిసెంబర్ 20న రాజ్యసభ ఉప ఎన్నికలు

దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో ఖాళీ అయిన ఆరు రాజ్యసభ స్థానాలకు డిసెంబర్ 20న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు స్థానాలు, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానాలో ఒక్కో స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. డిసెంబర్ 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి తుది ఫలితాలను ప్రకటిస్తారు.

## మసీదు సర్వే నేపథ్యంలో ఘర్షణ...

ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో మొఘల్ కాలం నాటి జామా మసీదు సర్వేను వ్యతిరేకిస్తూ పోలీసులతో జరిగిన ఆందోళనలో నలుగురు మృతి చెందగా, 20 మంది భద్రతా సిబ్బంది సహా పలువురు గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో స్థానికంగా ఇంటర్నెట్ సేవలను నిషేధించారు. దీంతోపాటు 12వ తరగతి వరకు స్కూళ్లు, కాలేజీలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్థానిక కోర్టు ఆదేశాల మేరకు మసీదును సర్వే చేయడంతో సంభాల్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సంభాల్ హింస వెనుక బీజేపీ ఉందని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. నలుగురి మరణానికి యోగి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## రిజర్వేషన్ల కోసం.. మతం మారడం రాజ్యాంగాన్ని మోసగించడమే: సుప్రీంకోర్టు

నిజమైన విశ్వాసం లేకుండా కేవలం రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందేందుకు మతం మారడం రాజ్యాంగాన్ని మోసగించడమేనని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఇది రిజర్వేషన్ల విధానానికే విరుద్ధమని, రిజర్వేషన్ల లక్ష్యాన్ని ఓడించడమేనని స్పష్టం చేసింది. సెల్వరాణి అనే మహిళ హిందూ తండ్రి, క్రైస్తవ తల్లికి జన్మించింది. పుట్టిన కొన్నిరోజులకే బాప్టిజం తీసుకొని, క్రైస్తవాన్ని ఆచరిస్తున్నది. పుదుచ్చేరిలో అప్పర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసేందుకు తన తండ్రి కులమైన వెల్లువన్‌గా తనకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయించాలని ఆమె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ఆమె వినతిని హైకోర్టు జనవరి 24న తిరస్కరించింది. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఆర్ మహదేవన్.. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ తీర్పు ఇచ్చారు.

## 'తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 55వేల ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమణల పాలు




"రెవెన్యూ రికార్డులు, మ్యుటేషన్, గెజిట్ నోటిఫికేషన్ల జారీలో జాప్యం వల్ల కోట్లాది రూపాయల విలువ చేసే వక్ఫ్ భూములను కొందరు అక్రమార్కులు కబ్జా చేశారు. నిజాం నవాబు కాలం నుంచి వచ్చిన వక్ఫ్ భూముల్లో 75 శాతం కబ్జాల పాలయ్యాయి. వేల కోట్ల రూపాయల విలువ చేసే 55వేల ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమణల పాలైన వీటిపై తెలంగాణ వక్ఫ్ బోర్డు కేసులు వేసింది" అని వక్ఫ్ బోర్డు సీఈవో ముహమ్మద్ అసదుల్లా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. 3,500 కు పైగా వేసిన కబ్జాల కేసులు కోర్టుల్లో విచారణలోనే ఉన్నాయని ఆయన తెలిపారు. నిజామాబాద్, మహబూబ్ నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి సంగారెడ్డి జిల్లాల్లో వేలాది ఎకరాల భూములు కబ్జా దారుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని తెలిపారు. తెలంగాణ వక్ఫ్ బోర్డు పరిధిలో మొత్తం 77వేల ఎకరాల భూములుండగా, ఇందులో 75 శాతం భూములు కొందరు బడా వ్యక్తులు, కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయి. కేవలం 22వేల ఎకరాల భూములు ఎలాంటి వివాదాలు లేకుండా వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్నాయి. కొందరు ముతవల్లీలు వక్ఫ్ భూములను అన్యాక్రాంతం చేశారు. వక్ఫ్ బోర్డు అధికారుల అవినీతి వల్ల భూములు కబ్జాల పాలయ్యాయి. కబ్జాల పాలైన వక్ఫ్ భూములను కాపాడేందుకు తాము న్యాయపోరాటం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## మహిళలకు ఇల్లు నరకప్రాయం: ఐరాస

మహిళలు, బాలికలకు ప్రాణాంతక, భయానక ప్రదేశం ఇల్లేనని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. 2023లో రోజుకు 140 మంది మహిళలు, బాలికలు తమ జీవిత భాగస్వామి, కుటుంబసభ్యుల చేతుల్లో హత్యకు గురయ్యారని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి మరణాల సంఖ్య సుమారు 51,100 అని వివరించాయి. 2022 లో 48,800 మంది ఈ విధంగా మరణించినట్లు అంచనా. ఈ నివేదికలను యునైటెడ్ నేషన్స్ విమెన్, యూఎన్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్ అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినం సందర్భంగా విడుదల చేశాయి. మహిళలు, బాలికలకు ప్రమాదకరమైన ప్రదేశం ఇల్లేనని వివరించాయి. ప్రతి లక్ష మంది జనాభాకు 2.9 మంది మహిళలు ఆఫ్రికా దేశాల్లోనూ, 1.6 మంది మహిళలు అమెరికాస్‌లోనూ ఈ విధంగా మరణించినట్లు తెలిపాయి. ఈ రేటు ఆసియా (0.8), యూరప్ (0.6)లో తక్కువ.

## కోల్‌కతాలో జన్మించిన భారత సంతతి వ్యక్తికి ట్రంప్ కీలక బాధ్యతలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత, డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం తన టీంను నిర్మించుకునే పనిలో బిజీగా ఉన్నారు. కొత్త పదవీకాలం రాకముందే ట్రంప్‌కు భారతీయులపై నమ్మకం పెరిగిందని చెప్పవచ్చు. ఎందుకంటే ట్రంప్ తన ప్రభుత్వంలో భారతీయ సంతతికి చెందిన అనేక మందిని చేర్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా కోల్‌కతాలో జన్మించిన జే భట్టాచార్యకు ట్రంప్ పెద్ద బాధ్యతను అప్పగించారు. ఆయనను దేశంలోని అత్యున్నత ఆరోగ్య పరిశోధన, నిధుల సంస్థలలో ఒకటైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (NIH) డైరెక్టర్‌గా నామినేట్ చేశారు. ఈ సమాచారాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

## అప్పుల కుప్పగా మారుతున్న అగ్రరాజ్యం

పేద దేశాలే కాదు అగ్రరాజ్యమూ అప్పులకుప్పగా మారుతున్నది. కొత్త దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్‌నకు ఈ అప్పులభారం అతిపెద్ద సవాల్‌గా మారనున్నది. తాజా లెక్కల ప్రకారం అమెరికా అప్పు ఏకంగా 36 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. భారత కరెన్సీలో ఇది అక్షరాలా 3,035 లక్షల కోట్ల రూపాయలు. ఈ ఏడాదే 2 ట్రిలియన్ డాలర్ల అప్పు పెరిగింది. ఇప్పుడు సగటున ఒక్కో అమెరికా పౌరుడిపై రూ.91 లక్షల అప్పు ఉంది.




## చిన్నారులకు నో సోషల్ మీడియా

16 ఏండ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారులకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించిన విషయంలో ఆస్ట్రేలియా ఒక అడుగు ముందుకేసింది. పార్లమెంటు దిగువ సభలో ఈ బిల్లు ఆమోదం పొందింది. బిల్లు ఆలస్యం విషయంలో గూగుల్, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాలు ప్రయత్నాలు చేసినా.. దిగువ సభ మాత్రం ఆమోదించటం గమనార్హం. ఈ బిల్లుకు ఆస్ట్రేలియా పార్లమెంటులోని ప్రతినిధుల సభలో 102 మంది సభ్యులు మద్దతివ్వగా, 13 మంది వ్యతిరేకించారు. ఈ బిల్లుకు మేజర్ పార్టీలు మద్దతు పలికాయి. ఈ బిల్లు ప్రకారం.. 16 ఏండ్ల లోపు వయసున్న చిన్నారులు సోషల్ మీడియా ఖాతాలు కలిగి ఉండటాన్ని నిరోధించే విషయంలో విఫలమైతే.. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలు 50 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్ల వరకు జరినామా చెల్లించాల్సి ఉంటుంది. పిల్లలకు సోషల్ మీడియా నిషేధంపై ఆస్ట్రేలియాలో మిశ్రమ స్పందన లభిస్తున్నది. బ్యాన్ మంచిదేననీ కొందరు అంటుండగా.. నిషేధం చిన్నారులను ఒంటరి చేస్తుందనీ, డార్క్ వెబ్‌కు వారు ఆకర్షితులవుతారని కొందరు విమర్శకులు అంటున్నారు.

## పర్వతం కూలితే పండుగ చేసుకున్నారు

ఆఫ్రికాలోని కాంగో దేశంలో ఓ పర్వతం కూలిపోయింది. పర్వతం కూలితే పెద్ద విశేషం ఏం ఉంది అనుకోకండి. అది కూలడంతో అక్కడి ప్రజలు పండుగ చేసుకుంటున్నారు. పర్వతం కూలితే ప్రజలకు ఇబ్బందే కదా! ప్రకృతి విలయంతో వాళ్లు ఎంతో బాధపడి ఉంటారు కదా? మరి పండుగ అంటారే అనేదేగా మీ సందేహం. పర్వతం కూలడంతో అందులో నుంచి విలువైన రాగి నిక్షేపాలు బయటపడ్డాయి. టన్నుల కొద్దీ రాగి బయటపడటంతో అక్కడి ప్రజలు సంతోషంలో మునిగిపోయారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 1950ల నుంచి అక్కడ కాపర్ మైనింగ్ పెరిగింది. ప్రపంచంలో రాగి ఉత్పత్తిలో టాప్‌లో ఉండటంతో ఈ పేద దేశంపై బడా దేశాల చూపు పడింది. అందుకే తాజాగా అక్కడ పర్వతం కూలి రాగి నిల్వలు బయటపడటం చర్చనీయాంశంగా మారింది. ఈ రాగితో స్థానిక ప్రజలు లాభపడితే బాగుంటుందని.. కానీ బ్రిటీష్, అమెరికా లాంటి దేశాలు అక్కడి వారికి ఆ అవకాశం ఇస్తాయా అని ఎక్స్‌పర్ట్స్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్కడి సంపద, వనరులపై స్థానికులకే సర్వ హక్కులు ఉన్నాయని.. ఇతరులు దోచుకోవడం కరెక్ట్ కాదని ఫైర్ అవుతున్నారు.

# 5 అంశాల ప్రాముఖ్యత

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**దైవప్రవక్త ముహమ్మద్(స) ఒక సందర్భంలో ఈ విధంగా పేర్కొన్నారు: ఐదు అంశాలను ఉనికిలోకి రావడానికి ముందు ఐదు అంశాల విలువను గ్రహించండి.**

1) యవ్వనం విలువను వృద్ధాప్యానికి ముందు గ్రహించండి: ఎందుకంటే యవ్వనం అనేది శాశ్వతం కాదు. యవ్వనం తర్వాత వృద్ధాప్యం దాపురిస్తుంది. లేదా మరణాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఈ రెండు తప్ప మూడవ మార్గమేదీ లేదు. కాబట్టి దైవ ప్రసాదితాలయిన శక్తి సామర్థ్యాలను, ఆరోగ్యాన్ని మంచి పనులకు వినియోగించాలి.


2) ఆరోగ్యం విలువను అనారోగ్యానికి ముందు గ్రహించండి: విశ్వాసం తర్వాత ఆరోగ్యమే అన్నిటికంటే గొప్ప వరప్రసాదంగా పరిగణించబడుతుంది. కనుక యవ్వనావస్థలో ఉన్నా లేక వృద్ధాప్యంలో ఉన్నా ఆరోగ్యంగా ఉన్నట్లయితే ధార్మికంగానూ, ప్రాపంచికంగానూ మేలు కోసం చేయగలిగినవన్నీ చేయాలి. ఎందుకంటే ఆరోగ్యం తర్వాత అనారోగ్యాన్ని ఎదుర్కోని వ్యక్తి ఈ ప్రపంచంలో ఎవరూ లేరు. వ్యాధి అనేది తప్పకుండా వస్తుంది. అయితే ఎప్పుడు వస్తుందో ఎవరూ చెప్పలేరు. కనుక వ్యాధులు చుట్టుముట్టక ముందే ప్రస్తుతమున్న ఆరోగ్యం విలువను గ్రహించాలి.

3) ఐశ్వర్యం విలువను పేదరికానికి ముందు గ్రహించండి : అనగా ఒక వ్యక్తికి ప్రస్తుతం లభ్యమయి ఉన్న ఐశ్వర్యం ఎప్పుడు చేజారిపోతుందో తెలియదు కదా! పరిస్థితులు తారుమారయిపోయిన వ్యక్తులు ఎందరో ఉన్నారు. ఒకప్పుడు ధనవంతులుగా, గొప్పగా బ్రతికిన వ్యక్తులు నేడు బీదరికంలో మగ్గుతున్నారు. ఏ నిమిషానికి ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు? మరణం అకస్మాత్తుగా విరుచుకుపడి ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి శాశ్వతంగా దూరం చేయవచ్చు కూడా. కాబట్టి సృష్టికర్త అనుగ్రహం వల్ల ప్రస్తుతం మీకు లభ్యమయి ఉన్న ధన రాశులను డబ్బు ద్వారా చేయదగిన ఆరాధనలు, దానధర్మాల వంటి సదాచరణల్లో ఖర్చు చేయాలి.

4) విరామ సమయం విలువను విభిన్న కార్యాలలో నిమగ్నమవడానికి ముందు గ్రహించండి.

5) జీవితం విలువను మరణానికి ముందే గ్రహించండి. ఈ జీవితం ఏదో ఒకనాడు ముగిసిపోతుంది. మృత్యువు అనేది అన్ని రకాల ఆచరణలనూ అంతమొందిస్తుంది. వాటితోపాటు పాపాల కొరకు పశ్చాత్తాపం చెందేందుకు, అల్లాహ్ వైపునకు మరలేం దుకు మిగిలి ఉన్న ద్వారాలను సైతం మృత్యువు అకస్మాత్తుగా మూసివేస్తుంది. కనుక జీవితంలోని ప్రతి క్షణాన్నీ విలువైనదిగా గ్రహించండి.

**తుదిగేటు**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**